విద్యారంగ సమస్యలా?

- టెట్ పరీక్షార్థులకు ఇబ్బందులున్నాయా?
- నేడు డయల్ యువర్ డీఈవో

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: జిల్లాలో విద్యారంగ పరంగా ఏమైనా సమస్యలున్నాయా? పాఠశాలల్లో కనీస సదుపాయాలు లేవా? విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసిన పాఠ్య పుస్తకాలు, స్కూలు బ్యాగులు, ఏకరూప దుస్తులు తదితర వస్తువుల్లో నాణ్యత లోపించిందా? విద్యార్థుల సంఖ్యకు తగినంత మంది ఉపాధ్యాయులు లేరా? ప్రైవేటు పాఠశాలల్లో అధిక రుసుములు వసూలు చేస్తున్నారా? నిబంధనలు పాటించడం లేదా? అక్టోబరు 3 నుంచి 21 వరకు నిర్వహించనున్న ఉపాధ్యాయ అర్హత పరీక్ష-టెట్‌కు సంబంధించి అభ్యర్థులకు ఏమైనా ఇబ్బందులున్నాయా? హాల్ టికెట్లలో తప్పిదాలు దొర్లాయా? ఒకేరోజు వేర్వేరుచోట్ల పరీక్ష కేంద్రాలు కేటాయించారా? ప్రభుత్వ బడుల్లో ఇటీవల నిర్వహించిన పని సర్దుబాటులో ఎక్కడైనా లోపాలు తలెత్తాయా? ఇటువంటి సమస్యలన్నీ నేరుగా జిల్లా విద్యాశాఖాధికారి ఎస్. అబ్రహం దృష్టికి తీసుకెళ్లే అవకాశాన్ని 'ఈనాడు' కల్పిస్తోంది. మీరు చేయాల్సిందల్లా ఫోన్ కాల్ మాత్రమే.



అబ్రహం

తేదీ: 28.9.24 శనివారం	సమయం: ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య	చరవాణి సంఖ్య: 88867 76799

గోదావరిలో పెరుగుతున్న వరద

పోలవరం, న్యూస్‌టుడే: గోదావరి పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు వరద పెరుగుతోంది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద శుక్రవారం సాయంత్రానికి 27.89 మీటర్లకు చేరింది. 48 గేట్ల ద్వారా 1.83 లక్షల క్యూసెక్కులు దిగువకు వెళ్తున్నట్లు జలవనరులశాఖ అధికారులు తెలిపారు.

జలాశయంలో 90.13 మీటర్లకు చేరిన నీరు

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పోలవరం మండలం ఎల్ఎన్డీపేట సమీపంలోని కొవ్వాడ జలాశయంలోకి వాగుల నీరు వచ్చి చేరుతోంది. జలాశయంలో నీటి మట్టం శుక్రవారం సాయంత్రానికి 90.13 మీటర్లకు చేరింది. దాంతో రెండు గేట్లు పైకి ఎత్తి 480 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నట్లు పర్యవేక్షణ ఇన్‌ఛార్జి డీఈ రాంబాబు చెప్పారు.

ట్రిపుల్ ఐటీని ప్రక్షాళన చేయండి

అధికారులకు మంత్రి కొలుసు ఆదేశం

నూజివీడు, చాట్రాయి, న్యూస్‌టుడే: ట్రిపుల్ ఐటీని ప్రక్షాళన చేసి.. విద్యార్థులు చదువుకునేందుకు అనువైన వాతావరణాన్ని కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి కొలుసు పార్థసారథి ట్రిపుల్ ఐటీ అధికారులను ఆదేశించారు. ఇటీవల ట్రిపుల్ ఐటీలో ఆహార నాణ్యతలోపం, విద్యార్థుల అనారోగ్యం, విద్యార్థుల ఆందోళన తదితర పరిస్థితులపై నూజివీడులోని తన క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రిపుల్ ఐటీలో ఇటువంటి పరిస్థితులు తరచూ పునరావృతం కావడం విచారకరం అన్నారు. కొత్తగా వచ్చిన డైరెక్టర్ పరిస్థితులు సరి చేసి, పాత మెస్ గుత్తేదారును తొలగించి, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆహార పదార్థాల నాణ్యత, పరిసరాల పరిశుభ్రత, విద్యార్థుల భద్రత, తదితర అంశాల పరిశీలన, పర్యవేక్షణకు ప్రత్యేక వ్యవస్థ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ అమరేంద్ర కుమార్, సీఏవో ప్రసాద్, ఏవో లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



ట్రిపుల్ ఐటీ అధికారితో మాట్లాడుతున్న పార్థసారథి

పొడిగింపా... వదిలింపా

ముగిసిన భూ రీసర్వే డీటీల కాలపరిమితి

ఈనాడు డిజిటల్, భీమవరం, నరసాపురం, న్యూస్‌టుడే: జిల్లాలో రీసర్వే ఉప తహసీల్దార్ల పరిస్థితి గాల్లో దీపంలా మారింది. గత ప్రభుత్వం రెండేళ్ల కాల పరిమితితో ఇచ్చిన ఉద్యోగోన్నతి ఈనెల 21తో ముగిసింది. గత ప్రభుత్వం జగనన్న శాశ్వత భూహక్కు - భూరక్ష పథకాన్ని ప్రారంభించినప్పుడు డీటీలకు హడావిడిగా తాత్కాలిక ఉద్యోగోన్నతి కల్పించింది. ప్రస్తుతం వారికి ఉద్యోగోన్నతి గడువును పొడిగిస్తారా లేదా అన్నది సందిగ్ధం నెలకొంది. క్షేత్రస్థాయిలో తలెత్తే భూవివాదాలు, సమస్యల పరిష్కారాలకు గత ప్రభుత్వం 2022 సెప్టెంబరు 22న రీసర్వే పోస్టులు సృష్టించింది. రెండేళ్ల కాలపరిమితితో సూపర్ న్యూమరరీ పోస్టులకు శ్రీకారం చుట్టి, తహసీల్దారు కార్యాలయాల్లో సీనియర్ అసిస్టెంట్ పోస్టులకు మంగళం పాడింది. ఉమ్మడి జిల్లాలో 47 మండలాల్లో 47 పోస్టులను రద్దు చేసి రీసర్వే డీటీ పోస్టులను సూపర్ న్యూమరరీగా మార్చింది. సీనియర్ అసిస్టెంట్, ఎంఆర్ఐలకు తాత్కాలిక ఉద్యోగోన్నతి కల్పించారు.



రీసర్వే పనులు ఆపేసింది

భూ రీసర్వేపై ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో కూటమి ప్రభుత్వం వచ్చాక ఆపేసింది. అంతకు ముందు కూడా సార్వత్రిక ఎన్నికల నియమావళి దృష్ట్యా ఏప్రిల్ నుంచి అన్ని మండలాల్లో సర్వే పనులు ఆగిపోయాయి. అప్పటి నుంచి వారికి నిర్దిష్టమైన విధుల్లేకపోవడంతో సంబంధిత తహసీల్దార్లు తమ పరిధిలో కావాల్సిన పనులు చేయించుకుంటున్నారు. దీనిపై డీఆర్‌వో ఉదయ్‌భాస్కర్‌ను వివరణ కోరగా వారిని కొనసాగించాలా వద్దా అనే దానిపై ప్రభుత్వం నుంచి ఎటువంటి ఉత్తర్వులు రాలేదన్నారు. అయితే ఈనెల 21తో గడువు ముగియడంతో జీతాల చెల్లింపు విషయమై ఖజానా శాఖ డీటీవో గణేశ్‌ను వివరణ కోరగా ప్రస్తుత నెలకు సంబంధించి బిల్లులు చెల్లిస్తామని, పనిదినాలకే జీతం చెల్లించాలంటే రికవరీ చేస్తామన్నారు.

ఒకటిన 3కే సైకిల్ ర్యాలీ

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశాల మేరకు అక్టోబరు ఒకటో తేదీన ఏలూరులో 3కే సైకిల్ ర్యాలీ నిర్వహించనున్నట్లు సెట్‌వెల్ సీఈవో ప్రభాకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 8.30 గంటలకు జూట్‌మిల్లు కూడలిలోని అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద నుంచి వట్లూరులోని సీఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల వరకు ర్యాలీ ఉంటుందన్నారు.

పరీక్షల పేరుతో దోచేస్తున్నారు

- జ్వరాలు ముసురుతున్న వేళ ఇష్టారాజ్యం
- అవసరం ఉన్నా లేకున్నా చేయించాల్సిందే
- పేద మధ్యతరగతి కుటుంబాలపై పెనుభారం

ఈనాడు, ఏలూరు, న్యూస్‌టుడే-జంగారెడ్డిగూడెం పట్టణం, పెనుమంట్ర

జ్వరాల విజృంభిస్తున్న వేళ.. ఇదే అదనుగా కొందరు ల్యాబు నిర్వాహకులు దోపిడీ చేస్తున్నారు. వైద్యులతో కుమ్మక్కై అవసరం లేకున్నా అన్ని రకాల పరీక్షలు చేయిస్తున్నారు. మరో పక్క ప్రభుత్వ ఆసుపత్రుల్లో పరీక్షలు సవ్యంగా చేయక పేద, మధ్యతరగతి వర్గాలు ఆర్థికంగా చితికిపోతున్నారు.



- జంగారెడ్డిగూడెం పట్టణంలోని ఓ కుటుంబంలో ముగ్గురు జ్వరంతో బాధపడుతూ స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లారు. .రోగుల పరిస్థితి తెలుసుకోకుండా అక్కడి వైద్యుడు ముగ్గురికీ అన్ని రకాల రక్త పరీక్షలు అవసరమని చెప్పి... రూ.2500 చొప్పున రూ.7500 వసూలు చేసి ఆసుపత్రిలోని ల్యాబులో చేయించారు. తీరా చూస్తే వారికి సాధారణ వైరల్ జ్వరాలే అని తేలింది.

- పెనుమంట్ర మండలం మార్టేరుకు చెందిన భార్యాభర్తలు జ్వరంతో స్థానిక ఆర్ఎంపీ దగ్గరకు వెళ్లారు. ఆయన పరీక్షలన్నీ చేయించి ప్లేట్‌లెట్లు పడిపోతున్నాయని 7 రోజుల కోర్సు వాడాలని చెప్పారు. తనకు అనుబంధంగా ఉన్న ఓ ల్యాబులో అవసరం ఉన్నా లేకున్నా పలు మార్లు డెంగీ, మలేరియా, ప్లేట్‌లెట్ల సంఖ్య తదితర పరీక్షలు చేయించారు. కేవలం పరీక్షలకే వారి నుంచి రూ.12 వేలు వసూలు చేశారు. వైద్యానికి రూ.40 వేలు అయ్యింది.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో గందరగోళం

ఏలూరు సర్వజన ఆసుపత్రి మొదలు చాలా ఆసుపత్రుల్లో పరీక్షల ఫలితాల్లో కచ్చితత్వం ఉండటం లేదు. ఇటీవల ఓ గర్భిణికి జ్వరం రావటంతో ఏలూరు జిల్లా ఆసుపత్రికి తీసుకువచ్చారు. హెచ్‌బీ పరీక్ష చేయించగా 6 పాయింట్లే ఉన్నట్లు చూపించింది. దీంతో కుటుంబ సభ్యులు కంగారు పడ్డారు. వెంటనే ప్రైవేటు ల్యాబులో పరీక్షించగా 9.5 వరకు ఉన్నట్లు చూపించింది. ఇలా చాలా పరీక్షల్లో వచ్చిన ఫలితాలపై నమ్మకం లేక ఆర్థిక భారం ఉన్నా ప్రైవేటు వైపే వెళుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో..

ప్రైవేటు ఆసుపత్రులు:	700
అనుమతులున్న ప్రైవేటు ల్యాబులు:	419
అనధికారిక ల్యాబులు:	దాదాపు 200
ఆర్ఎంపీల సంఖ్య	దాదాపు 1200

ప్యాకేజీ పరీక్షలతో దోపిడీ

తణుకుకు చెందిన ఓ వ్యక్తికి గురువారం జ్వరం రావటంతో ఓ ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లారు. వైద్యుడు రోగి లక్షణాలు తెలుసుకోకుండానే ప్యాకేజీ పరీక్షలు చేయించుకోవాలని చీటీ రాసి పంపారు. అందులో డెంగీ, మలేరియా, టైఫాయిడ్, ప్లేట్‌లెట్, మధుమేహం ఇలా అన్ని రకాల పరీక్షలు ఉన్నాయి. అన్నింటికీ కలిపి రూ.2200 వసూలు చేశారు. తీరా చూస్తే సాధారణ జ్వరం అని మందులిచ్చి పంపేశారు. ఇలా జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రధాన పట్టణాలు, నగరాల్లో జరుగుతోంది.

గత మూడేళ్లలో నమోదైన జ్వరాల కేసులు

ఏడాది	డెంగీ	మలేరియా	టైఫాయిడ్
2022–23	455	101	6012
2023–24	423	195	4621
2024–25 (ఇప్పటి వరకు)	350	216	3456

ఆర్థికంగా చితికిపోతున్నారు

మూడు నెలల నుంచి ఉమ్మడి జిల్లాలో జ్వరాల ప్రభావం చాలా ఎక్కువగా ఉంది. బాధితుల లెక్క ప్రభుత్వం రికార్డుల్లో వందల్లో ఉంటే క్షేత్రస్థాయిలో వేలల్లో ఉంది. చాలా ఆసుపత్రుల్లోనే ల్యాబులు ఉండగా.. లేనివారు బయట ల్యాబు నిర్వాహకులతో కుమ్మక్కయ్యారు. ఆర్ఎంపీలు సైతం ఎలాంటి అనుమతులు లేకుండా వెనకుండి ల్యాబులు నిర్వహిస్తున్నారు. దీంతో అవసరమైనా లేకున్నా అన్ని రకాల పరీక్షలు చేయిస్తున్నారు. ఒక్కొక్కరికీ పరీక్షలకే రూ.2000 వరకు ఖర్చవుతోంది. కుటుంబం మొత్తం బాధితులైతే పరీక్షలకే రూ.8 వేల ఖర్చవుతోంది. దీంతో పాటు ఓపీ, మందులు, ప్రయాణ ఖర్చులు కలిపితే తడిసి మోపెడవుతోంది. పేద, మధ్యతరగతి ప్రజలకు ఇది పెనుభారంగా మారింది. దీనిపై ఏలూరు, పశ్చిమ డీఎంహెచ్‌వోలు శర్మిష్ఠ, మహేశ్వరరావులు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యం : ఎస్పీ

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: పోలీసు సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట వేస్తామని, వారి సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు చేపడతామని ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ అన్నారు. ఏలూరులోని పోలీసు ప్రధాన కార్యాలయంలో శుక్రవారం సంక్షేమ దివస్ నిర్వహించారు. సిబ్బంది నుంచి వినతులు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కార్యాలయ అధికారులను ఆయన ఆదేశించారు.



వినతులు పరిశీలిస్తున్న కిశోర్

ఎక్సైజ్ శాఖ ఉప కమిషనర్ బాధ్యతల స్వీకరణ

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్‌గా బి.శ్రీలత శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె గతంలో ఏలూరు జిల్లాలో అసిస్టెంట్ కమిషనర్‌గా పని చేశారు. కర్నూలు జిల్లాలో డీసీగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు.





విజయము లీయగ రావమ్మా!

దేవీ నవరాత్రులు సమీపిస్తున్న వేళ దుర్గాదేవి విగ్రహాల తయారీ ఊపందుకుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పది అడుగుల ఎత్తు వరకూ వివిధ రూపాల్లోని దుర్గామాత విగ్రహాలను తయారు చేస్తున్నారు. పలు ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి తమకు కావాల్సిన రూపాల్లో ప్రతిమల తయారీకి ఒప్పందాలు చేసుకుంటున్నారు. అత్తిలిలో సిద్ధం చేస్తున్న అమ్మవారి విగ్రహాలివి. -ఈనాడు, అత్తిలి

చేతులెత్తేశారు

- నిధులు ఇవ్వని గత ప్రభుత్వం
- నిరుపయోగంగా బోర్లు

పోలవరం, న్యూస్‌టుడే: గిరిజనుల వ్యవసాయ అభివృద్ధికి చేపట్టిన జలకళ పథకం వైకాపా ప్రభుత్వ తీరుతో నిధులు లేక నీరుగారిపోయింది. ఐటీడీఏ పరిధిలోని గిరిజన గ్రామాల్లో డ్వామా అధికారుల పర్యవేక్షణలో బోర్లు వేశారు. విద్యుత్తు కనెక్షన్ ఖర్చులు లబ్ధిదారులే భరించాలని, తర్వాత మోటారు ఇస్తామని ప్రారంభంలో అధికారులు చెప్పారు. అందులో భాగంగా పోలవరం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాలకు 1064 బోర్లు మంజూరు చేశారు. కొన్ని బోర్లు వేసిన తర్వాత వాటికి బిల్లులు చెల్లించకపోవడంతో ఆ పనులు అంతటితో ఆగిపోయాయి. అప్పటి నుంచి పట్టించుకున్న నాథుడు లేరు. ప్రభుత్వం నుంచి రూ.14 కోట్లు వరకు బకాయి ఉండటంతో గుత్తేదారు చేతులెత్తేశారు.



కొమ్ముగూడెంలో బోరు వేస్తున్న రిగ్ (పాత చిత్రం)

ప్రభుత్వం బోర్లు వేయించి మోటార్లు ఇస్తుందనుకున్న గిరిజనులకు నిరాశ మిగిలింది. విద్యుత్తు కోసం రూ.లక్షలు చెల్లించే పరిస్థితి లేక ఎప్పటికైనా ఇస్తారన్న ఆశతో లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు.

హడావుడితో సరి.. పోలవరం మండలం వింజరం, ప్రగడపల్లి పంచాయతీల పరిధిలోని గిరిజన గ్రామాలకు అప్పట్లో బోర్లు మంజూరు కావడంతో అధికారులు హడావుడి చేశారు. రిగ్ రావడంతో లబ్ధిదారులతో కలిసి కొబ్బరికాయలు కొట్టారు. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా వృద్ధి చెందాలని గిరిజన రైతులకు సూచించారు.



'విద్యుత్తు లైన్ వేయాలంటే మూడు, నాలుగు స్తంభాలు పడతాయి. సుమారు రూ.రెండు లక్షలు పైబడి కట్టాల్సి ఉంటుందని ట్రాన్స్‌కో సిబ్బంది చెబుతున్నారు. అంత మొత్తం కట్టే పరిస్థితి మాకు లేదు. అధికారులు బోరు వేయించి ఉపయోగం లేకుండా ఉంది' అని పోలవరం మండలం కొమ్ముగూడేనికి చెందిన కగ్గులోతు కాంతమ్మ వాపోయారు.

తీరా కొన్ని బోర్లు వేసిన తర్వాత గుత్తేదారు బిల్లులు రావడం లేదంటూ వెళ్లిపోయాడు. ఈ పరిస్థితిపై జంగారెడ్డిగూడెం డ్వామా ఏపీడీ డి.దామోదరరావు 'న్యూస్‌టుడే' సంప్రదించగా.. గతంలో వేసిన బోర్లకు గతంలోనే బిల్లులు చేసినా, అప్పటి ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదన్నారు. తాను బాధ్యతలు చేపట్టిన తర్వాత వేసిన బోర్లకు రూ.20 లక్షలకు బిల్లులు సిద్ధం చేసి ఉంచామని చెప్పారు.

	మంజూరైన బోర్లు	వేసినవి
బుట్టాయగూడెం	549	211
జీలుగుమిల్లి	338	148
పోలవరం	177	12

సానుకూలతలెన్నో... సవాళ్లన్నీ!

- ఎక్సైజ్ శాఖపై గురుతర బాధ్యత
- గంజాయి, సారా కట్టడిపై దృష్టి

'ప్రశాంత ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో కొన్నాళ్లుగా గంజాయి ఘాటు గుప్పుమంటోంది. పల్లె నుంచి పట్టణం వరకు సారా ఏరులై పారుతోంది. అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి జిల్లాల సరిహద్దులోని చించినాడ వశిష్ఠ వంతెన వద్ద ఈ ఏడాది మూడుసార్లు గంజాయి విక్రేతలను పోలీసులు అరెస్టు చేశారు.'

'వైకాపా ప్రభుత్వ హయాంలో జంగారెడ్డిగూడెంలో కల్తీ సారా తాగి పలువురు ప్రాణాలు కోల్పోయిన ఘటన కళ్లముందే కదలాడుతోంది. ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా పునర్ వ్యవస్థీకరించాల్సిన బాధ్యత ఎక్సైజ్ శాఖపై ఉంది.'

న్యూస్‌టుడే - పాలకొల్లు

దశలవారీగా మద్యపానం నిషేధిస్తామని 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా... ఆ తర్వాత హామీని అటకెక్కించింది. మద్యం ధరలను విపరీతంగా పెంచేసింది. నాసిరకం మద్యాన్ని వినియోగంలోకి తీసుకొచ్చి... ప్రజల ఆరోగ్యంతో ఆటలాడింది. అక్రమ అమ్మకాలు, సారా కట్టడికి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్) ఏర్పాటు చేసి చేతులు దులుపుకొంది. సెబ్‌కు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించిన పాపాన పోలేదు. ఎక్సైజ్ సిబ్బందిని విభజించి పబ్బం గడుపుకొంది. వైకాపా నేతల ఒత్తిళ్లతో సెబ్ యంత్రాంగం కార్యాలయాలకే పరిమితమైంది. ప్రస్తుత ఎన్డీయే ప్రభుత్వం సెబ్‌ను ప్రక్షాళన చేసి.. . ఎక్సైజ్ శాఖకు పునర్వైభవం తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంది. అక్టోబర్ 2 నుంచి నూతన మద్యం విధానం అమలులోకి వస్తున్న నేపథ్యంలో. .. సెబ్‌ను ఎక్సైజ్‌లో విలీనం చేస్తూ ఇప్పటికే ఉత్తర్వులు సైతం జారీ చేసింది.



ప్రగల్భాలకే పరిమితం

మద్యం అమ్మకాలు పారదర్శకంగా చేస్తామంటూ వైకాపా ప్రభుత్వం ప్రగల్భాలు పలికినా... అనేక చోట్ల ఉద్యోగులే అక్రమాలకు పాల్పడ్డారు. వారిపైనే పెద్ద సంఖ్యలో కేసులు నమోదయ్యాయి. గొలుసు దుకాణాలు, అక్రమ అమ్మకాలను కట్టడి చేయాల్సిన సెబ్... మద్యం దుకాణాల్లో పని చేసే వారికి కాపలా కాసేందుకే పరిమితమైంది. మద్యం సరఫరా ఎక్సైజ్‌కు, పర్యవేక్షణ సెబ్‌కు అప్పగించడంతో అయిదేళ్లపాటు వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది.

పూర్తి అధికారాలు

కొత్త విధానంలో ఎక్సైజ్ శాఖకు పూర్తిస్థాయిలో అధికారాలు, కార్యాలయాలు, సిబ్బంది కేటాయింపునకు పచ్చజెండా ఊపింది. ప్రస్తుతం పూర్వ జవసత్వాలు వచ్చిన నేపథ్యంలో... ప్రధానంగా గంజాయిపై ఉక్కుపాదం మోపాల్సిన సమయం ఆసన్నమైంది. ఉమ్మడి జిల్లాలో గంజాయి చాపకింద నీరులా విస్తరిస్తోంది. యువత గంజాయి మత్తులో జోగుతోంది. దీనిపై విస్తృతంగా తనిఖీలు చేపట్టి, విక్రేతలను కటకటాల్లోకి పంపాలి. సారా తయారీ, విక్రయాలపైనా దృష్టి సారించాలి. గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే గొలుసు దుకాణాలపైనా నిఘా ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.

కొత్త విధానంలో ప్రయోజనాలివీ	ఏర్పాటయ్యే ఆబ్కారీ స్టేషన్లు: 13	కొలువుదీరనున్న సీఐలు: 13	ఎస్సైలు : 26 హెడ్‌కానిస్టేబుళ్లు : 50	కానిస్టేబుళ్లు 150

నవోదయ గడువు పెంపు.. పెదవేగి, న్యూస్‌టుడే: పెదవేగిలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరం 6వ తరగతిలో ప్రవేశానికి నిర్వహించే పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు అక్టోబరు 7వ తేదీ వరకు ప్రభుత్వం పొడిగించినట్లు ప్రిన్సిపల్ బి.సీతాలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు.

పక్షం రోజుల్లోనే పరిహారం

ముదినేపల్లి, న్యూస్‌టుడే: భారీ వర్షాలు, వరదలకు గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రజలు సర్వం కోల్పోయారు. రైతులు, మరోపక్క ఇల్లు కూలిన వారు తేరుకోలేని విధంగా దెబ్బ తిన్నారు. వారిని ఆదుకోవడానికి ఎన్డీయే ప్రభుత్వం చురుగ్గా అడుగులు వేసింది. శరవేగంగా నష్టం అంచనా వేయించడమే కాకుండా జాగులేకుండా పరిహారాన్ని బాధితుల బ్యాంకు ఖాతాల్లో జమచేశారు. ఈనెల 25న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పరిహారం విడుదల చేయగానే బాధితుల ఖాతాల్లోకి గంటల వ్యవధిలోనే నేరుగా జమయ్యింది. గత ప్రభుత్వంలో బటన్ నొక్కిన దగ్గర నుంచి పరిహారం కోసం ఎదురు చూడటం, బ్యాంకులు చుట్టూ తిరగడం చేసేవారమని, ప్రస్తుతం అలా లేకుండా నష్టం జరిగిన పక్షం రోజుల్లోనే పరిహారం అందిందని రైతులు, వరద బాధితులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో దాదాపు 15 వేల ఎకరాల్లో వరి పంట దెబ్బతినగా హెక్టారుకు రూ.25 వేల చొప్పున పరిహారం అందించారు. అలాగే దెబ్బతిన్న ఇల్లు సైజును, నష్టాన్ని బట్టి పరిహారం ఖాతాల్లో జమ చేశారు.



మునిగిన వరి చేను

ప్రభుత్వం సకాలంలో ఆదుకుంది



అధిక వర్షాలు వల్ల ఇల్లు పడిపోయింది. ప్రభుత్వం కష్టకాలంలో ఆదుకొంది. ఇబ్బందుల్లో ఉన్న మా కుటుంబానికి నెల రోజుల లోపు రూ.పది వేల సాయం ప్రభుత్వం అందించింది. ఇంత తొందరగా సాయం అందుతుందని కలలో కూడా ఊహించలేదు.

\- బత్తుల నాగేశ్వరరావు, పెదగొన్నూరు

జాప్యం లేకుండా జమ



గతంలో నష్టం జరిగిందంటే సర్వేలు, నమోదు పేరుతో రోజుల తరబడి జాప్యం చేసేవారు. అది విడుదల చేశాక నెలల తరబడి ఎదురుచూడాల్సి వచ్చేది. అలా కాకుండా పక్షం రోజుల్లో అన్ని ప్రక్రియలు పూర్తి చేసి పరిహారం అందించి రైతులను ఆదుకోవడం ఆనందదాయకం. కష్టకాలంలో ప్రభుత్వం బాసటగా నిలవడంతో కొంత ఊపిరి పీల్చుకోగలుగుతున్నాం.

\- చల్లగుల్ల రమణ, రైతు, పెదపాలపర్రు

దక్షిణ కాశీ.. కైలాసం మురిసి





ఆఖరి మజిలీ సమస్యకు ఆరు గ్రామాల ప్రజలే ముగింపు పలికారు. వశిష్ఠ గోదావరి తీరాన ప్రకృతి రమణీయత మధ్య సుందర కైలాస వనం నిర్మించుకున్నారు. వడ్డిలంక, గంగడపాలెం, మట్లపాలెం, నార్నిమెరక, నక్కాపాలెం, లక్ష్మీపాలెం గ్రామస్థులు రూ.30 లక్షలకు పైగా స్వచ్ఛంద విరాళాలు పోగు చేసుకున్నారు. దక్షిణ కాశీగా ఖ్యాతి గడించిన యలమంచిలి మండలం లక్ష్మీపాలెంలో దీన్ని ఏర్పాటు చేయగా శనివారం ప్రారంభించనున్నారు. - న్యూస్‌టుడే, యలమంచిలి

గోదావరి తీరంలో ప్రకృతి సోయగాల మధ్య నిర్మించిన కైలాసవనం

వరద బాధితులకు చేయూత

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో తెదేపా ఎప్పుడూ ముందుంటుందని చింతలపూడి శాసనసభ్యుడు సొంగా రోషన్ కుమార్ అన్నారు. విజయవాడ వరద బాధితుల సహాయార్థం జంగారెడ్డిగూడెం మండలం తాడువాయి గ్రామ తెదేపా నాయకులు, కార్యకర్తలు సేకరించిన రూ.5 లక్షల విరాళాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధి నిమిత్తం చెక్కు రూపంలో ఎమ్మెల్యేకు ఆయన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం అందించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు కొడవటి సత్తిరాజు, ఉప్పునూతల పుల్లారావు, కనికళ్ల శ్రీనివాస్, కొడవటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు చెక్కు అందిస్తున్న తాడువాయి గ్రామ తెదేపా నాయకులు

ఉంగుటూరు, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితులకు ఐస్ పరిశ్రమల అసోసియేషన్ ఆపన్నహస్తం అందించింది. ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పిలుపు మేరకు.. ఉంగుటూరు మండలంలోని ఐస్ పరిశ్రమల వారు రూ.16 లక్షలను సీఎం సహాయనిధికి విరాళంగా ఇచ్చారు. ఆ చెక్కును నారాయణపురంలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ధర్మరాజుకు అందజేశారు. ఐస్ పరిశ్రమల అసోసియేషన్ అధ్యక్షుడు వేగేశ్న రంగరాజు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ధర్మరాజుకు చెక్కు అందజేస్తున్న రంగరాజు తదితరులు

టీవీగా ఇటు.. టీవీ వైపు అటు

జీలుగుమిల్లి, న్యూస్‌టుడే: ఒకే గదిలో కొంత మంది ఇటు వైపు కూర్చుని.. మరి కొందరు అటు వైపు టీవీ చూస్తూ కనిపిస్తున్న ఈ చిత్రం శుక్రవారం జీలుగుమిల్లి మండల పరిషత్తు సమావేశ మందిరంలోని పరిస్థితి. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో మండలాభివృద్ధిపై సమావేశం ఏర్పాటు చేయగా ఉపాధి హామీ పథకం ఉన్నతాధికారులు అదే సమయంలో దృశ్య శ్రవణ సమావేశం నిర్వహించారు. ఇదే సమావేశ మందిరంలో టీవీ ఉండగా ఉపాధి హామీ అధికారులు, సిబ్బంది ఇలా వెనుక భాగంలో కూర్చున్నారు.



ఓ వైపు సర్వసభ్య.. మరో వైపు ఉపాధి దృశ్య శ్రవణ సమావేశాలు

పొట్టలో తాళం చెవులు !



ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: తాళం చెవులు మింగిన ఓ యువకునికి ఏలూరులోని ఆయుష్ ఆసుపత్రి వైద్యులు ఎండోస్కోపి చేసి పొట్టలో నుంచి సురక్షితంగా బయటకు తీశారు. ఓ యువకుడు రెండు తాళాలు మింగి గురువారం అర్ధరాత్రి ఆసుపత్రికి వచ్చాడు. ఆసుపత్రి వైద్యుడు జయదీప్ పరీక్షించి ఎక్స్‌రే తీసి పొట్టలో రెండు తాళం చెవులు ఉన్నట్లు నిర్ధారించారు. అత్యవసరంగా ఎండోస్కోపీ చేసి తాళాలు బయటకు తీసినట్లు వైద్యులు తెలిపారు.

ఆరుగురికి గాంధీ స్మారక పురస్కారాలు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఆరుగురు గాంధేవాదులు, సేవాతత్పరులను గాంధీ స్మారక పురస్కారాలకు ఎంపిక చేసినట్లు సర్వోదయ మండలి ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐయినాల ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారికి అక్టోబరు 2న పురస్కారాలు ప్రదానం చేస్తామన్నారు. ఎంపికైన వారు: తుమ్మలపల్లి శివ (భీమవరం), కొండ్రెడ్డి సర్వేశ్వరరావు (ఉంగుటూరు), లకంసాని సత్యనారాయణ (మల్లవరం), పెన్మెత్స రామమోహన వర్మ (చింతపర్రు), కేమిశెట్టి లలితాంబ (వల్లివేరు), రుద్రరాజు బంగార్రాజు (పత్తేపురం).

1న నిరసన దీక్షలకు పిలుపు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ అక్టోబరు 1న నిరసన దీక్షలు నిర్వహించనున్నట్లు వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు. స్థానిక ఇఫ్టూ కార్యాలయంలో శుక్రవారం పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ, పీవైఎల్, ఏఐఎస్ఎఫ్ నాయకుల సమావేశం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ లాభాల బాటలో ఉన్న పరిశ్రమను కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం ప్రైవేటుపరం చేయాలని చూస్తోందని విమర్శించారు. పరిశ్రమ పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలన్నారు. ఒకటో తేదీన నిర్వహించే నిరసన దీక్షలను జయప్రదం చేయాలని యువతకు పిలుపునిచ్చారు. సమావేశంలో విద్యార్థి సంఘాల నాయకులు కె.నాని, ఎం.క్రాంతి, కె.లెనిన్, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ఖర్చు కాగితాల్లో.. చెత్త యార్డులో

కానరాని అభివృద్ధి.. తప్పని కాలుష్యం

ఏలూరు టూటౌన్, అర్బన్, న్యూస్‌టుడే

✪ జిల్లా కేంద్రం ఏలూరు నగర శివారులో ఉన్న డంపింగ్ యార్డు సమస్యలకు చిరునామాగా మారింది. శివారు ప్రాంతం పోణంగి సమీపంలో ఉన్న ఈ డంపింగ్ యార్డు కాలుష్యానికి కేంద్రంగా తయారైంది. నిత్యం అక్కడ వ్యర్థాలు తగలబెడుతుంటారు. దీంతో దట్టమైన పొగ ఆ చుట్టుపక్కల అలుముకుని ఉంటుంది. పరిసరప్రాంతాల ప్రజలు కాలుష్య కోరల్లో చిక్కుకుంటున్నారు. ఈ డంపింగ్ యార్డును వేరే ప్రాంతానికి మార్చాలని ప్రతిపాదనలు ఉన్నా ఆ దిశగా చర్యలు లేవు.



పోణంగి వద్ద కంపోస్టు యార్డులో చెత్తకు నిప్పు

ప్రాంతం:	విస్తీర్ణం:
పోణంగి	34 ఎకరాలు
నిత్యం సేకరించే వ్యర్థాలు : 103 టన్నులు	
ఏలూరు నుంచి దూరం: 5 కి.మీ	

✪ చెత్తను తగలబెట్టేందుకు ఇద్దరు సిబ్బందిని ఏర్పాటు చేశారు. చెత్త కాలుతుంటే ఆ ప్రాంతమంతా పొగతో నిండిపోతోంది. దాన్ని నివారించేందుకు పైపులతో వాటరింగ్ చేస్తుంటారు. అయినా పొగను కట్టడి చేయలేకపోతున్నారు. ఇక్కడ వర్మి కంపోస్టు యూనిట్లున్నా అవి పనిచేయటంలేదు. దీనికి తోడు గత వైకాపా పాలనలో డంపింగ్ యార్డులో అభివృద్ధి పనుల పేరిట రూ.లక్షలు దోచేశారు. డంపింగ్ యార్డులో 7 రోడ్ల ఆధునికీకరణ, లెవలింగ్ వంటి మొత్తం 11 పనులకు రూ.50.83 లక్షలు ఖర్చు పెట్టారు. ఆ ఖర్చంతా అక్కడ కనిపించడం లేదని కాగితాలకే పరిమితమైందని పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. డంపింగ్ యార్డులో పనిచేసే పొక్లెయిన్ మరమ్మతులకు గురి కావటంతో మరొక యంత్రాన్ని తీసుకువచ్చి పనులు చేస్తున్నారు. కానీ పూర్తిస్థాయిలో చెత్తను సరిచేయకపోవటంతో ఎక్కడికక్కడే వ్యర్థాలు పేరుకుపోతున్నాయి.

నిలిచిన బయోమైనింగ్ ట్రీట్‌మెంట్ పనులు

బయోమైనింగ్ ట్రీట్‌మెంట్ పనులు నిలిచిపోవటంతో 10 సంవత్సరాలుగా పేరుకుపోయిన చెత్త నిల్వలు అలానే ఉండిపోయాయి. మొత్తం 48 వేల టన్నుల చెత్త డంపింగ్ యార్డులో ఉంది. తొలగించేందుకు బయోమైనింగ్ ట్రీట్‌మెంట్ విధానాన్ని పాటిస్తున్నారు. దీనికి గుత్తేదారులు టన్నుకు రూ.456 వసూలు చేస్తున్నారు. రోజుకు 15 నుంచి 20 టన్నులు మైనింగ్ చేస్తున్నారు. అయితే గుత్తేదారుకు డబ్బులు సరిగా ఇవ్వకపోవటంతో ఇటీవల పనులు నిలిపివేశారు.



వర్మి కంపోస్టు యార్డు వద్ద పాడైన పరికరాలు

ఊరిస్తున్న బయోగ్యాస్ ప్లాంట్

చెత్త నిల్వలతో బయోగ్యాస్‌ను తయారు చేసే వీలున్నా కొన్ని కారణాలతో ఇక్కడ అది సాధ్యం కావటంలేదు. రోజుకు తడి చెత్త 100 టన్నులు దాటితేనే ఈ ప్లాంట్‌కు ప్రభుత్వం అనుమతి ఇస్తుంది. ఈ యార్డుకు రోజుకు 60 టన్నుల తడి చెత్తే వస్తుంది. దీంతో ప్లాంట్ ఏర్పాటు ఇప్పట్లో సాకారమయ్యే పరిస్థితి కనిపించడం లేదు.

'పోణంగిలో డంపింగ్ యార్డు సమస్య పరిష్కరిస్తా. ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటా' అని ఎమ్మెల్యే బడేటి చంటి తెలిపారు.

ఉపాధ్యాయుడి కీచక బుద్ధి

పోక్సో కేసు నమోదు

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: బుట్టాయగూడెం మండలం బూసరాజుపల్లి గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో పొరుగు సేవల పద్ధతిన పని చేస్తున్న చిత్ర లేఖన ఉపాధ్యాయుడు జక్కుల మురళీకృష్ణ ఒక విద్యార్థితో అసభ్యంగా ప్రవర్తిస్తూ వేధింపులకు పాల్పడ్డాడని బాధితురాలి తల్లి శుక్రవారం ఫిర్యాదు చేశారు. గిరిజన సంక్షేమశాఖ ఇన్‌ఛార్జి డీడీ పీవీఎస్ నాయుడు పాఠశాలలో ప్రాథమిక విచారణ చేశారు. వివరాలు ఇలా.. కళాశాల విద్యను అభ్యసిస్తున్న జీలుగుమిల్లి మండలానికి చెందిన ఆ విద్యార్థిని పట్ల అతను రెండేళ్ల కిందట అసభ్యంగా ప్రవర్తించి వేధింపులకు గురి చేశాడు. అప్పట్లో బాధితురాలి తండ్రి మందలించారు. తండ్రి నెల కిందట మృతి చెందారు. తండ్రి లేకపోవడాన్ని ఆ కీచక ఉపాధ్యాయుడు అలుసుగా తీసుకుని మళ్లీ అసభ్యంగా ప్రవర్తించడం మొదలెట్టాడు. కొడుతూ, బెదిరింపులకు పాల్పడుతున్నాడు. బాధితురాలు తల్లికి చెప్పడంతో జీలుగుమిల్లి జడ్పీటీసీ మాజీ సభ్యుడు, తెదేపా సీనియర్ నాయకుడు బాసిన రాజబాబు సహకారంతో పాఠశాలకు చేరుకుని ఉపాధ్యాయుడిని నిలదీశారు. బాగా చదివే తన కుమార్తె భయపడిపోతోందని ఆమె కన్నీటి పర్యంతమయ్యారు. గతంలో కూడా అతను వేధింపులకు పాల్పడిన సందర్భాలు ఉన్నా ప్రిన్సిపల్, సిబ్బంది పట్టించుకోలేదని, అతనిపై చర్యలు తీసుకోవాలని రాజబాబు ఇన్‌ఛార్జి డీడీని కోరారు. తాను ప్రాథమిక విచారణ చేసి, ఏటీడబ్ల్యూవో శ్రీవిద్యతో తదుపరి విచారణ చేయించానని, నివేదికను ఉన్నతాధికారులకు అందజేసి అతనిపై చర్యలు తీసుకుంటామని ఇన్‌ఛార్జి డీడీ తెలిపారు. ఎస్సై దుర్గా మహేశ్వరరావు విచారణ చేస్తున్నారు. నిందితుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు.

వ్యవసాయ సంక్షోభానికి ప్రభుత్వాల విధానాలే కారణం

రాష్ట్ర రైతు సదస్సులో శోభనాద్రీశ్వరరావు



మాట్లాడుతున్న మాజీ మంత్రి వడ్డే

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: వ్యవసాయ సంక్షోభానికి ప్రభుత్వాల విధానాలే కారణమని, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే ప్రత్యామ్నాయ వ్యవసాయ విధానాలు అవసరమని వ్యవసాయ శాఖ మాజీ మంత్రి, ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు అన్నారు. ద్వారకాతిరుమల శ్రీకృష్ణ యాదవ కల్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర రైతు సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ సదస్సుకు ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మర్రాపు సూర్యనారాయణ అధ్యక్షత వహించారు. ముందుగా రైతు సంఘం జెండాను గుత్తికొండ వెంకట కృష్ణారావు ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ రైతులు తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బడా కార్పొరేట్ కంపెనీలకు మోదీ ప్రభుత్వం గడిచిన ఐదు సంవత్సరాలలో రూ.14 లక్షల కోట్ల బ్యాంకు రుణాలు మాఫీ చేసిందని, రైతులకు మాత్రం ఒక్క పైసా కూడా రుణ మాఫీ చేయలేదన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పూర్వ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ వ్యవసాయంలో రైతుల సంఖ్య రోజు రోజుకు తగ్గిపోతోందన్నారు. కౌలు రైతుల సంక్షేమాన్ని ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని విమర్శించారు. రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, ఉపాధ్యక్షులు వై.కేశవరావు మాట్లాడుతూ రైతాంగ సమస్యలపై దేశ వ్యాప్తం రైతు ఉద్యమం త్వరలో నిర్వహిస్తామని, నవంబరు 26న దిల్లీలో జరగబోయే కార్యక్రమంలో రైతు సంఘాలతో పాటు కార్మిక సంఘాలు పాల్గొంటాయని వివరించారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక

ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే: పల్నాడు జిల్లా వినుకొండ లయోలా పాఠశాలలో ఈ నెల 28 నుంచి జరిగే రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ బాలబాలికల స్కూల్ గేమ్స్ పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి 36 మంది ఎంపికయ్యారని అండర్-17 ఉమ్మడి జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి అలివేలు మంగ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

బాస్కెట్‌బాల్ పోటీలకు.. ముసునూరు, న్యూస్‌టుడే: రమణక్కపేట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు పసుమర్తి రామకృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయుడు వాకా నాగరాజు శుక్రవారం తెలిపారు. 25న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి కృష్ణాజిల్లా బాస్కెట్‌బాల్ ఎంపికలు నూజివీడులో జరిగాయి. ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు తెలిపారు.

విధుల్లో చేరిన పీహెచ్‌సీ వైద్యులు

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ కొద్ది రోజులుగా సమ్మె చేస్తున్న జిల్లాలోని పీహెచ్‌సీ వైద్యులు శుక్రవారం విధుల్లో చేరారు. పీహెచ్‌సీ వైద్యుల సంఘం నాయకులు ప్రభుత్వంతో జరిపిన చర్చల్లో కొన్ని డిమాండ్లకు ప్రభుత్వం అంగీకరించడంతో వైద్యులు సమ్మె విరమించి విధుల్లో చేరారు.

కళాశాలకు వెళ్లడం ఇష్టం లేక యువకుడి ఆత్మహత్య

ముసునూరు, న్యూస్‌టుడే: పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ముసునూరు మండలం వేల్పుచర్లలో జరిగింది. ఇన్‌ఛార్జి ఎస్సై కె.రాజారెడ్డి కథనం మేరకు.. గ్రామానికి చెందిన యువకుడు(18) ఏలూరులోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. కళాశాలకు వెళ్లడం, చదువు అంటే ఇష్టం లేక జీవితంపై విరక్తి చెంది ఈ నెల 17న ఇంటి వద్ద వ్యవసాయ పనులకు ఉపయోగించే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు తొలుత ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి, అనంతరం మెరుగైన వైద్య నిమిత్తం విజయవాడ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గణేశ్ నిమజ్జనంలో అపశ్రుతి: యువకుడి దుర్మరణం

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: గణపతి నిమజ్జనంలో అపశ్రుతి చోటు చేసుకుంది. ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. దెందులూరు పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చల్లచింతలపూడిలోని ఊర చెరువులో గురువారం రాత్రి గణేశ్ నిమజ్జనం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న సింహాద్రి అయ్యప్ప (20) ప్రమాదవశాత్తు చెరువులో పడ్డాడు. కొంతసేపటి తరువాత గమనించిన కొందరు అతనిని చెరువులో నుంచి బయటకు తీసి భీమడోలు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అయ్యప్ప మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు. వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. దెందులూరు పోలీసు స్టేషన్ ఏఎస్సై వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధ తాళలేక ఆక్వా రైతు ఆత్మహత్యాయత్నం

పరిస్థితి విషమం.. ఆందోళనలో కుటుంబ సభ్యులు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: ఆక్వా సాగులో వరుస నష్టాలు రావడంతో అప్పుల బాధ తాళలేక ఆక్వా రైతు పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించిన ఘటన శ్రీహరిపురం శివారు స్తంభంచెరువలో జరిగింది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తెదేపా నాయకుడు రెడ్డి నాగరాజు(48) కొన్నేళ్లుగా రొయ్యలు, చేపల సాగు చేస్తున్నారు. వరుస నష్టాలతో పెట్టుబడి సైతం రావడం లేదు. దీంతో తిరిగి చెల్లించాలంటూ అప్పు ఇచ్చిన వారు, మేతల దుకాణదారులు తీవ్ర ఒత్తిడి చేస్తున్నారు. దీంతో శుక్రవారం పెదగొన్నూరు శివారు ఉప్పరగూడెంలోని చెరువు వద్ద పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గుడివాడలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. స్థానికంగా ఉంటున్న నాయకుడు, ఆయన భార్య, మరికొంత మంది అప్పులు తిరిగి కట్టాలని వేధిస్తున్నారని, ఎప్పటికప్పుడు వడ్డీలు, అసలులో కొంత జమ చేస్తున్నామని నాగరాజు భార్య నాగమణి తెలిపారు. దీనిపై తమ దృష్టికి ఎటువంటి ఫిర్యాదు రాలేదని ఎస్సై వెంకటకుమార్ తెలిపారు.

నాగరాజుపై పోలీసులకు ఫిర్యాదు.. ఆత్మహత్యా యత్నంకు పాల్పడిన రెడ్డి నాగరాజుపై అదే గ్రామానికి చెందిన చేపల రైతు లింగమనేని భానుప్రసాద్ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై వెంకటకుమార్ తెలిపారు. భానుప్రసాద్‌కు చెందిన చెరువుల్లో ఈ ఏడాది మే 31 నుంచి జూన్ 6 వరకు చేపల పట్టుబడి జరిగిందన్నారు. దానిని ఏజెంట్ రెడ్డి నాగరాజు ద్వారా ఆకివీడులోని ఓ చేపల కంపెనీకి విక్రయించానని, దానికి సంబంధించి ఇంకా రూ.27 లక్షలు ఏజెంట్ అయిన నాగరాజు నుంచి రావాల్సి ఉందని, అంతేగాని తాను వడ్డీలకు ఇవ్వలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. సమగ్ర విచారణ చేయాలని ఆయన కోరారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా) (కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -121 రిటైల్ ధర 143 చికెన్ విత్ స్కిన్ - 207, చికెన్ స్కిన్‌లెస్ - 236.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 137, 148 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డ ధర
★ For the Information of Trade & Industry
★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 5.30 పైII
తణుకు ఆఫీసు: 08819-224254

ఏలూరు

● ఏలూరు ● దెందులూరు ● ఉంగుటూరు

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

ఏలూరు తూర్పువీధి: 80081 23847 | ఏలూరు గ్రామీణ: 80085 74535
పెదపాడు, పెదవేగి: 80085 74483 | ఉంగుటూరు : 79933 00492

దెందులూరు, ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే

సమస్య: జాలిపూడి రోడ్డులోని చాటపర్రు గ్రామ పంచాయతీ చెరువు కాలుష్య కాసారంలా మారింది. తూడు, గుర్రపుడెక్క కుళ్లి దోమలకు నిలయంగా తయారైంది. ఈ కారణంగా చుట్టు పక్కల ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. **- శ్రీనివాసరావు, చాటపర్రు**

సమాధానం: చెరువును శుభ్రం చేయించేందుకు చర్యలు తీసుకుంటాం. **- వర్మ, పంచాయతీ కార్యదర్శి**

సమస్య: దెందులూరులో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. విద్యార్థులు భయం భయంగా రాకపోకలు సాగిస్తున్నారు. కుక్కలు వెంబడిస్తుండటంతో చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. **- కృష్ణమోహన్, దెందులూరు**

సమాధానం: కుక్కలకు సంతాన నిరోధక శస్త్ర చికిత్సల నిమిత్తం పశుసంవర్ధక శాఖాధికారులకు లేఖలు పంపాం. మరో సారి ఆ శాఖ అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటాం. **- శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి**

సమస్య: గొల్లాయిగూడెం సమీపంలోని హేలాపురి నగర్ గ్రాండ్ ఆర్య కాలనీలో రోడ్డుకు ఇరువైపులా నీరు నిలిచి ఉంది. నడిచే దారి లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. **- బోనం ప్రసాదరావు, హేలాపురినగర్**

సమాధానం: సిబ్బందిని పంపించి నీరు బయటకు వెళ్లేలా చర్యలు తీసుకుంటాం. **- మాలతీ, ఎంహెచ్‌వో, ఏలూరు**

నిడమర్రు గ్రామీణం, న్యూస్‌టుడే

సమస్య: నిడమర్రు కాలనీలో చాలా రోజుల నుంచి మురుగు కాలువలు శుభ్రం చేయడం లేదు. దుర్వాసన వెదజల్లుతుండటంతో పాటు దోమల బెడద ఎక్కువగా ఉంది. **- స్వామి, స్థానికుడు**

సమాధానం : పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం. **- స్వామి, పంచాయతీ కార్యదర్శి**

పెదపాడు, న్యూస్‌టుడే

సమస్య: కలపర్రు నుంచి వెళ్లే మినీబైపాస్ వెంబడి వట్లూరు గ్రామం నుంచి సేకరించిన చెత్త, వ్యర్థాలు పారబోస్తున్నారు. దుర్వాసన వెదజల్లుతోంది. **- వాహన చోదకుడు, వట్లూరు**

సమాధానం: పరిశీలించి వ్యర్థాలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. అక్కడ చెత్త, వ్యర్థాలు వేయకుండా పారిశుద్ధ్య సిబ్బందికి ఆదేశాలిస్తాం. **- మేకా శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి**

స్పందనకు స్పందన

వెలిగిన వీధి దీపాలు.. **ఏలూరు తూర్పు వీధి, న్యూస్‌టుడే:** కొత్తూరు రాజీవ్ గృహ కల్ప కాలనీకి వెళ్లే రోడ్డులోని వీధి దీపాలను వెలిగించారు. ఈ సమస్యపై ఈ నెల 27న ప్రచురితమైన వార్తకు విద్యుత్తు ఏఈ కె.శేషగిరి స్పందించి సిబ్బందితో మరమ్మతులు చేయించారు.



వ్యర్థాలతో గుంతల పూడ్చివేత

ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే: ఏలూరు జిల్లా పశువుల ఆసుపత్రి కార్యాలయ రోడ్డులోని నివాసాల ముందున్న రహదారిపై గుంతలను డ్రెయిన్ల నుంచి తీసిన వ్యర్థాలతో పూడ్చారు. ఈ కారణంగా దుర్వాసన వెదజల్లుతుండటంతో పాదచారులు, వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై శానిటరీ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్‌ను వివరణ కోరగా సిబ్బందితో గుంతల్లో వేసిన వ్యర్థాలను తొలగిస్తామని తెలిపారు.

స్వచ్ఛ కార్యక్రమాలపై ప్రచారం

భీమడోలు, న్యూస్‌టుడే: గుండుగొలనులో మన ఇల్లు, మన గౌరవం, స్వచ్ఛ కార్యక్రమాలపై ఎంపీపీ పాఠశాల-2 విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఇంజినీరింగ్ సిబ్బంది శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఎంఈవో-1 శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్య కళాశాలలో ప్రవేశాలకు కౌన్సెలింగ్

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థుల ప్రవేశాలకు సంబంధించి మొదటి విడత కౌన్సెలింగ్ శుక్రవారం ముగిసింది. మొదటి సంవత్సరానికి మొత్తం 150 సీట్లు మంజూరు కాగా.. వీటిలో ఆలిండియా కోటా 22, రాష్ట్ర కోటా 55, ఎన్ఆర్ఐ కోటా 14, సెల్ఫ్ ఫైనాన్స్ కోటా 36, ఇతర కోటా కింద 36 సీట్లు కేటాయించారు. ఆలిండియా కోటా కింద ఇప్పటి వరకు 19, రాష్ట్ర కోటాలో 53, కన్వీనర్ కోటాలో 14, సెల్ఫ్ ఫైనాన్స్‌లో 36 మంది చేరారు. ఆలిండియా కోటా కింద సీటు పొందిన కేరళ రాష్ట్రానికి చెందిన విద్యార్థి హృదయ్ ప్రవేశం పొందారు.

ప్రయాణం.. నరకప్రాయం



కాట్లంపూడి వద్ద అధ్వానంగా రహదారి

చాటపర్రు (ఏలూరు గ్రామీణ), న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల రహదారులు అధ్వానంగా మారాయి. పెద్ద పెద్ద గుంతలతో ఛిద్రంగా మారిన రోడ్లపై రాకపోకలకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. మాదేపల్లి నుంచి జాలిపూడి మీదుగా చాటపర్రు వెళ్లే ప్రధాన మార్గంలో ప్రయాణం నరకప్రాయంగా ఉంటోందని ప్రజలు, వాహన చోదకులు చెబుతున్నారు. ఏలూరు - కైకలూరు రహదారిలోని ఈ మార్గం లంక గ్రామాలకు వెళ్లేందుకు దగ్గర దారి. చేపలు, మేత రవాణా చేసే భారీ వాహనాలతో రద్దీగా ఉంటుంది. జాలిపూడి నుంచి చాటపర్రు జడ్పీ ఉన్నత పాఠశాలకు పలువురు విద్యార్థులు వెళ్తుంటారు. ఇంతటి ప్రాధాన్యమున్న మార్గాన్ని గత వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. ఏటా మంజూరు చేయాల్సిన నిర్వహణ నిధులు కూడా ఇవ్వలేదు. ఫలితంగా గోతులను కూడా పూడ్చలేని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా మాదేపల్లి, కాట్లంపూడి, జాలిపూడి ఎంపీపీ పాఠశాల నుంచి సగర్లపేట వరకు రహదారి పూర్తిగా దెబ్బతింది. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు రోడ్లు భవనాల శాఖ పరిధిలోని పలు రహదారుల మరమ్మతులకు అత్యవసర నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కూటమి ప్రభుత్వంలోనైనా రహదారి బాగుపడి రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని ఆ ప్రాంత ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



జాలిపూడిలో ఇలా..



ఇటొస్తే... ఒళ్లు హూనమే!

పెదవేగి, న్యూస్‌టుడే: పెదవేగి మండలం దుగ్గిరాల నుంచి పెదపాడు మండలం వట్లూరు పంచాయతీ సీతారామపురం మీదుగా వట్లూరు వెళ్లే జడ్పీ రహదారి గుంతలమయమైంది. దాదాపు 5 కిలోమీటర్ల ఈ మార్గం దారుణంగా మారి ఏళ్లు గడుస్తున్నా ప్రజా ప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ దారిలో పలు కళాశాలలు ఉండటంతో పెదవేగి మండల విద్యార్థులు ఎక్కువగా ప్రయాణాలు సాగిస్తుంటారు. వాహనాల రాకపోకలూ ఎక్కువే. మరో ప్రత్యామ్నాయం లేక గుంతల దారిలో ఒళ్లు హూనం చేసుకుంటూ ప్రజలు ప్రయాణాలు సాగిస్తున్నారు. ఈ విషయమై జడ్పీ ఏఈ బాషా మాట్లాడుతూ రహదారికి మరమ్మతులు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రతి ఇంటికి మంచినీటి కుళాయి: పత్సమట్ల



చేబ్రోలులో శిలాఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే ధర్మరాజు

భీమడోలు, న్యూస్‌టుడే: అందరికీ స్వచ్ఛమైన తాగునీరు అందాలన్న లక్ష్యానికి అనుగుణంగా జల్‌జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి మంచినీటి కుళాయి అందిస్తామని శాసనసభ్యుడు పత్సమట్ల ధర్మరాజు అన్నారు. గుండుగొలను, భీమడోలు గ్రామాల్లోని గృహ నిర్మాణ కాలనీల్లో జల్ జీవన్ మిషన్ నిధులతో నిర్మిస్తున్న రెండు ఓహెచ్ఎస్ఆర్(నీళ్ల ట్యాంకులు)ల నిర్మాణ పనులకు ఆయన శుక్రవారం శంకుస్థాపనలు చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం కేంద్రం మంజూరు చేసిన జల్ జీవన్ మిషన్ నిధులను వినియోగించడంలో విఫలమైందన్నారు. కార్యక్రమాల్లో తెదేపా, జనసేన, భాజపా నాయకులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఉంగుటూరు, న్యూస్‌టుడే: జల్‌జీవన్ మిషన్‌ను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని తాగునీటి సమస్యల పరిష్కారం ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. చేబ్రోలు, బొమ్మిడి కాలనీల్లో జల్‌జీవన్ మిషన్ నిధులతో ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణానికి శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. సర్పంచులు రాంధే లక్ష్మీసునీత, మద్దాల రాధాకుమారి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రమేష్, ఏఈ రామారావు, తెదేపా, భాజపా మండల అధ్యక్షులు పాతూరి విజయ్‌కుమార్, వంజరపు దుర్గారావు, నాయకులు పాల్గొన్నారు.

చేపల మార్కెట్లో సమస్యలు పరిష్కరిస్తా: బడేటి



వ్యాపారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: నగరంలోని చేపల మార్కెట్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే బడేటి చంటి హామీ ఇచ్చారు. శుక్రవారం ఆయన చేపల మార్కెట్‌ను పరిశీలించారు. వ్యాపారుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్వరలో నూతన ప్లాట్‌ఫాంలు అందుబాటులోకి తెస్తామన్నారు. చిరు వ్యాపారులు రహదారులపై కాకుండా నిర్దేశిత స్థలాల్లో చేపలు విక్రయించుకోవచ్చని తెలిపారు. అనంతరం ఏడో డివిజన్‌లోని పాత చేపల మార్కెట్‌ను సందర్శించి వర్తకుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ కోఆప్షన్ సభ్యుడు పెదబాబు, కె.మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఆటోలో క్యూఆర్ కోడ్ కార్డు ఉండాలి: సీఐ



కార్డులు చూపుతున్న ట్రాఫిక్ పోలీసు అధికారులు, సిబ్బంది

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రతి ఆటో డ్రైవర్ క్యూఆర్ కోడ్ కార్డును ఆటోలో కనిపించేలా ప్రదర్శించాలని ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు సూచించారు. అమీనాపేటలోని సురేష్‌చంద్ర బహుగుణ పాఠశాల ప్రాంగణంలోని కల్యాణ మండపంలో ఆటో చోదకులకు రహదారి ప్రమాదాల నివారణ, నేరాల నియంత్రణపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఏలూరు గ్లోబల్ టెక్నాలజీ టీం రూపొందించిన అత్యాధునిక క్యూఆర్ కోడ్‌ను ఆటో యజమానులకు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కోడ్ స్కాన్ చేస్తే ఆటో యజమాని పూర్తి వివరాలు తెలుస్తాయన్నారు. ట్రాఫిక్ ఎస్సై రంగారావు, ఆర్ఎస్ఐ అమరేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికులకు అన్ని వసతులు కల్పించాలి

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: దుకాణాల్లో పని చేస్తున్న కార్మికులకు యాజమాన్యాలు అన్ని వసతులు కల్పించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్ సూచించారు ఏలూరు నగరంలోని దుకాణాల్లో పని చేస్తున్న కార్మికులకు శుక్రవారం కార్మిక చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా కార్మికుల వ్యక్తిగత భద్రతపై యాజమాన్యాలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాలు పొందేందుకు వివరాలను కార్మిక శాఖాధికారి కార్యాలయంలో నమోదు చేసుకోవాలని సూచించారు. బాల కార్మికులతో పని చేయించడం చట్టరీత్యా నేరమని, వారితో పనులు చేయిస్తున్నట్లు ఎవరి దృష్టికైనా వస్తే న్యాయ సేవాధికార సంస్థకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో కార్మిక శాఖాధికారి గోపాలకృష్ణ, ప్యానల్ న్యాయవాదులు కూన కృష్ణారావు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకానికి సిఫార్సు చేస్తా: ఎస్పీ

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఏలూరు సీసీఎస్ పోలీసు స్టేషన్‌లో పనిచేస్తూ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన డి.నరసింహారావు కుమారుడు సీతారామ్‌కు ఫ్లాగ్ ఫండ్ నుంచి రూ.25 వేలు, విడో ఫండ్ నుంచి రూ.50 వేల చెక్కులను ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో సేవలందిస్తూ మరణించిన వారి కుటుంబ సభ్యుల్లో అర్హులకు కారుణ్య నియామకానికి సిఫార్సు చేస్తానని, ప్రభుత్వం నుంచి రావాల్సిన రాయితీలు త్వరగా అందేలా తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఏఆర్ అదనపు ఎస్పీ ఎన్ఎస్ఎస్ శేఖర్, పోలీసు ప్రధాన కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దసరా మహోత్సవాలకు పందిరిరాట

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: సత్రంపాడులోని అంబికాదేవి సన్నిధిలో 19వ దసరా నవరాత్రి మహోత్సవాలకు శ్రీకారంగా ఆలయ ప్రాంగణంలో శుక్రవారం పందిరిరాట నిర్వహించారు. అర్చకులు తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక



గుండుగొలను ఉన్నత పాఠశాల విద్యార్థులు

భీమడోలు, న్యూస్టుడే: రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్.జి.ఎఫ్.) పోటీలకు గుండుగొలనులోని శ్రీమావులేటి సోమరాజు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయిని గారపాటి సునీత తెలిపారు. ఇటీవల పెదవేగి గురుకుల పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొన్న పాఠశాల విద్యార్థులు పది మంది రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్, బేస్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారన్నారు. అండర్-17 విభాగంలో గంటా అజయ్, వల్లెపు తేజ, బెల్లాని వీరమణికంఠ, ఏకుల నాగదుర్గ, జంగం లక్ష్మీప్రసన్న, అండర్-14 విభాగంలో ఇళ్ల దుర్గాభవాని, సివాపు వెంకటలలిత, దార అనన్య, ముత్తారపు శశికిరణ్, గిట్టా కల్యాణ్‌బాబు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. పాఠశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో వీరిని ఉపాధ్యాయులు అభినందించారు. పీడీ వి.వెంకటేశ్వరరావు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ సంస్థ ఏఈగా సతీష్

ఉంగుటూరు, న్యూస్‌టుడే: ఉంగుటూరు మండల గృహ నిర్మాణ సంస్థ ఏఈగా చింతలపూడి సతీష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత ఏఈ సురేష్‌బాబు ఏలూరు బదిలీ అయ్యారు. సురేష్‌బాబుకు ఇంజినీరింగ్ సహాయకులు, గృహ నిర్మాణ సంస్థ సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు.

డీఈగా పీర్ అహ్మద్‌ఖాన్.. **ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే:** విద్యుత్తు శాఖ ఏలూరు సర్కిల్ కార్యాలయ డీఈ(టెక్నికల్)గా పీర్ అహ్మద్ ఖాన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఆహార భద్రత అధికారులమంటూ వసూళ్లు ఇద్దరిపై కేసు

నిడమర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: నిడమర్రులోని పలు హోటళ్ల వద్దకెళ్లి తాము ఆహార భద్రత అధికారులమంటూ బెదిరించి వసూళ్లకు పాల్పడుతున్న ఇద్దరిపై నిడమర్రు పోలీసులు గురువారం రాత్రి కేసు నమోదు చేశారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... పెంటపాడుకు చెందిన మంద్రు అశోక్‌బాబు, తానేటి గీతాప్రసాద్ కారులో నిడమర్రులోని రాజేశ్వరి హోటల్‌కు వచ్చి యజమాని రాజేశ్వరి నుంచి డబ్బులు వసూలు చేశారు. అలాగే హోటళ్ల నిర్వాహకులు వేమా శివకుమార్, తోరం రవికుమార్‌ల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేశారు. రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వీర ప్రసాద్ తెలిపారు.

ఉంగుటూరు, న్యూస్‌టుడే: ఉపాధి హామీ నిధులతో గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఎంపీడీవో రాజ్‌మనోజ్ అన్నారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో సీసీ రహదారులు, గ్రావెల్ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి ఉపాధి నిధులు రూ.4.98 కోట్లు కేటాయించామని, గుర్తించిన 34 పనులను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. అలాగే 65 పశువుల షెడ్లకు రూ.1.38 కోట్లు మంజూరైనట్లు వెల్లడించారు. మత్స్య, ఆబ్కారీ, రభ శాఖలు, ఆర్టీసీ అధికారులు సమావేశానికి హాజరుకాక పోవడంతో ఎంపీడీవో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎందుకు హాజరు కాలేదో వారం రోజుల్లో వివరణ ఇవ్వాలని నోటీసులు జారీచేశారు. కాకర్లమూడిలో ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు ఏర్పాటు చేయాలని, గ్రావెల్ రోడ్లకు నిధులు కేటాయించాలని సర్పంచి నాగ వెంకట సత్యనారాయణ ఎంపీడీవోకి వినతిపత్రం అందజేశారు. నాచుగుంటలో పలువురు మేట్లు తమకు ఇష్టమైన వారినే పనులకు పిలుస్తున్నారని సర్పంచి ఏలేటి సునీత అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. జడ్పీటీసీ సభ్యురాలు కొరిపల్లి జయలక్ష్మి, ఉప ఎంపీపీ మేడవరపు ఈశ్వరి విద్యాలక్ష్మి, తహసీల్దారు బొడ్డేపల్లి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణానికి ఉపాధి నిధులు



మాట్లాడుతున్న ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి

ఎమ్మెల్యే రఘురామను అరెస్టు చేయాలి

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఏలూరుపాడులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫ్లెక్సీని చించిన ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజును అరెస్టు చేయాలని ఏలూరు ఎస్సీ, ఎస్టీ అడ్వకేట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఏలూరు బార్ అసోసియేషన్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో రఘురామకృష్ణరాజు చర్యలను న్యాయవాదులు ఖండించారు. కాకినాడలో దళిత వైద్యుడిపై కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ దాడి చేయడం హేయమైన చర్య అని అసోసియేషన్ అధ్యక్షుడు పయనం రత్నరాజు అన్నారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నినాదాలు చేశారు.

పైవంతెన నిర్మాణానికి హద్దుల పరిశీలన



హద్దులను పరిశీలిస్తున్న అధికారులు

కైకరం (ఉంగుటూరు), న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై కైకరం వద్ద పైవంతెన నిర్మాణం విషయమై రెవెన్యూ, హైవే అథారిటీ అధికారులు శుక్రవారం పరిశీలించారు. రహదారి ప్రమాదాలు ఎక్కువగా జరగడంతో కైకరం వద్ద పైవంతెన నిర్మాణానికి 2017-18లో హైవే అథారిటీ శ్రీకారం చుట్టింది. ఎంత మేర భూమి అవసరమవుతుందో సర్వే చేసి హద్దులు వేశారు. నిర్వాసితులు భూ సేకరణ, నష్టపరిహారం తదితర విషయాల్లో కోర్టును ఆశ్రయించారు. ఇటీవల హైవే అథారిటీకి అనుకూలంగా తీర్పు వచ్చింది. ఈ మేరకు గతంలో వేసిన హద్దులను ఇన్‌ఛార్జి తహసీల్దారు బొడ్డేపల్లి దుర్గాప్రసాద్, మండల సర్వేయర్ పొన్న శ్రీనివాస్, హైవే అథారిటీ ప్రత్యేక డిప్యూటీ తహసీల్దారు ఎన్‌వీవీ సత్యనారాయణ పరిశీలించారు. వీఆర్వోలు శ్రీనివాసరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: పురపాలక ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముస్తాఫాఅలీ, ఆర్.రవికుమార్ తదితరులు శుక్రవారం డీఈవోకు వినతి పత్రం అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ పురపాలక ఉన్నత పాఠశాలల్లో తగినంత మంది సబ్జెక్టు ఉపాధ్యాయులను నియమించాలన్నారు. హెచ్ఎంలలో అర్హులకు అర్బన్ ఎంఈవోలుగా ఉద్యోగోన్నతి కల్పించాలని కోరారు. జీపీఎఫ్ ఖాతాలు తెరిపించాలని, బదిలీలు వెంటనే నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.

పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఎన్ఆర్ పేటలోని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు(సీజీజీబీ)లో శుక్రవారం పారిశుద్ధ్య కార్మికులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టరు రావి అనంతలక్ష్మి ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించి సూచనలు ఇచ్చారు. అనంతరం సీజీజీబీ ఏలూరు రీజినల్ మేనేజర్ యు.శ్రీదేవి పారిశుద్ధ్య కార్మికులకు పీపీ కిట్లు ఉచితంగా పంపిణీ చేశారు. బ్యాంకు మేనేజరు ఎం.హైందవి, రీజినల్ కార్యాలయ సీనియర్ మేనేజర్ మహేశ్వరరావు, మార్కెటింగ్ అధికారి ఎంవీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు చేరిన పాదయాత్ర.. **ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే:** కల్తీ ప్రసాదం దోషులకు శిక్షలు వేయిద్దామంటూ కాకినాడ జిల్లా పెద్దాపురంలోని తారా వారాహి లోక కల్యాణార్థ సేవా భారత్ ట్రస్టు చేపట్టిన తిరుమలకు పోదాం రండి పాదయాత్ర శుక్రవారం ఏలూరుకు చేరుకుంది. వారాహి అమ్మవారి సన్నిధి నుంచి ఈ నెల 23న బయలుదేరిన ట్రస్టు సభ్యులు అఖండ దీపాన్ని శిరస్సున పెట్టుకొని పాదయాత్ర సాగిస్తున్నారు.

విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు.. **గణపవరం, న్యూస్‌టుడే:** స్థానిక ఎస్.సి.హెచ్.వి.పి.ఎం.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా ఇంక్లూసివ్ సెంటర్, విష్ణు దంత వైద్య కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు ఉచిత దంత వైద్య పరీక్షలు చేశారు. 220 మందికి పరీక్షలు నిర్వహించినట్లు వైద్యుడు కె.ఎస్.చైతన్య తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ నిర్మల కుమారి, మధు రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

అవి ఇవి అన్నీ

లక్ష్మీగణపతికి విశేష అలంకరణ.. **ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే:** సత్రంపాడులోని లక్ష్మీగణపతి ఆలయంలో స్వామివారికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఎండు పండ్లు, వివిధ రకాల పుష్పమాలలతో విశేష అలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.



వ్యాసరచన పోటీలు.. **భీమడోలు, న్యూస్‌టుడే:** స్వర్ణాంధ్ర-2047 కార్యక్రమంలో భాగంగా భీమడోలు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించినట్లు ఎంఈవో-2 భాస్కర కుమార్ తెలిపారు. మండల స్థాయిలో జరిగిన పోటీలకు వివిధ పాఠశాలలకు చెందిన 25 మంది పాల్గొన్నారన్నారు. వ్యాసరచన, ఎలక్యూషన్, వక్తృత పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన ఎల్.యశస్విని (భీమడోలు), వి.వెంకటదుర్గారావు(భీమడోలు), సీహెచ్ నాగవెంకట దుర్గారావు(గుండుగొలను)లు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ప్రధానోపాధ్యాయుడు బి.శ్రీనివాసరావు, సీఆర్పీలు రమణ, సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: స్థానిక సీఆర్ఆర్ మహిళా కళాశాలలో సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 'విద్యార్థినులకు ప్రాణప్రదమైన వస్తువులు లేదా విషయాలు' అనే అంశంపై పోటీలు ఏర్పాటుచేశారు. సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు శశిశేఖరరావు, ఎం.జానకి, ఎ.అనిత, ఎం.వెంకటేశ్వరరావు, కళాశాల ఇన్‌ఛార్జి ప్రధానాచార్యురాలు జి.సరళ పోటీలను పర్యవేక్షించారు.

ఆత్మహత్యాయత్నం అడ్డగింత

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని అడ్డుకొని అతనిని కుటుంబ సభ్యులకు అప్పగించారు పోలీసులు. వారు తెలిపిన వివరాల మేరకు.. దెందులూరు మండలం రామారావు గూడేనికి చెందిన బొగ్గూరి భాస్కరరావు ఇంటిపై తీసుకున్న రుణం వాయిదా చెల్లించలేదని లోన్ రికవరీ ఏజెంట్లు కొందరు శుక్రవారం ఇంటికొచ్చి దౌర్జన్యం చేశారు. ఈ క్రమంలో రుణం వాయిదా కట్టేందుకు అవసరమైన సొమ్ము కోసం భాస్కరరావు తన తండ్రి ఇంటికి వెళ్తూ మార్గం మధ్యలో వేగివాడ బ్రిడ్జి వద్ద ద్విచక్ర వాహనం ఆపి భార్య రత్నకుమారికి ఫోన్ చేసి పిల్లల్ని జాగ్రత్తగా చూసుకోమని చెప్పారు. ఆ విషయాన్ని రత్నకుమారి 112కి డయల్ చేసి చెప్పింది. సమాచారం అందుకున్న పెదవేగి పోలీసు స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్ అక్కడికి వెళ్లి భాస్కరరావు ఆత్మహత్య చేసుకోకుండా అడ్డుకొని కౌన్సెలింగ్ నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పోలవరం
•పోలవరం • చింతలపూడి



జంగారెడ్డిగూడెం నూకాలమ్మకు వెండి చీర తయారీకి వెండి అందిస్తున్న భక్తులు

అమ్మవారికి విశేష పూజలు

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం పట్టణంలోని నూకాలమ్మ ఆలయంలో శుక్రవారం విశేషపూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శనార్థం మహిళా భక్తులు ఆలయానికి విచ్చేసి తమ మొక్కుబడులు చెల్లించుకున్నారు. అమ్మవారికి వెండి చీరను తయారు చేయాలనే సంకల్పంలో భాగంగా దాతలు ఇతోధికంగా వెండి అందిస్తున్నారని ఆలయ ఛైర్మన్ రాజాన సత్యనారాయణ తెలిపారు. ★ పురపాలక కార్యాలయం పక్కన ఆలయంలోని ముత్యాలమ్మకు శుక్రవారం పంచామృత ఏకవార రుద్రాభిషేకం, కుంకుమార్చనలు నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో ముత్యాలమ్మ

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

పోలవరం, న్యూస్‌టుడే: పోలవరం విద్యుత్తు ఉప కేంద్రంలో సాంకేతిక సమస్యలు పరిష్కరించడం కోసం శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ కె.సత్యనారాయణ చెప్పారు. విద్యుత్తు వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ముగిసిన నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న చింతలపూడి నియోజకవర్గ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఎంపికలు శుక్రవారంతో ముగిశాయని మండల కో-ఆర్డినేటర్ ఎల్.జయరాజు అన్నారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ క్రీడా పోటీల్లో 800 మంది విద్యార్థులు పాల్గొన్నారని.. వీరిలో 270 మంది విద్యార్థులు వివిధ పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు.



ఎంపికైన విద్యార్థులతో పాఠశాల సిబ్బంది

చుట్టూ తుప్పలు.. విద్యార్థినులకు తిప్పలు

సాంఘిక సంక్షేమ శాఖ వసతిగృహ బాలికల ఆందోళన



కొయ్యలగూడెం బాలికల వసతిగృహం

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: కొయ్యలగూడెం సాంఘికసంక్షేమశాఖ బాలికల వసతిగృహం ఆవరణలోని ఖాళీ స్థలంలో తుప్పలు పెరిగి విష పురుగులకు నిలయంగా మారిందని విద్యార్థినులు ఆందోళన చెందుతున్నారు. వసతిగృహం ప్రవేశ ద్వారంలో ప్రహరీ పొడవునా మురుగు కాలువ పూడిక నిండి దోమలతో అవస్థలు పడుతున్నారు. దశాబ్దాల క్రితం నిర్మించిన భవనాలు శిథిలస్థితికి చేరాయి. శ్లాబ్‌లు నీరు కారుతున్నాయని సిబ్బంది చెబుతున్నారు. వంటగది కోసం వాడే భవనం సగ భాగం గోడలు, శ్లాబ్ పూర్తిగా పాడవడంతో మిగిలిన భాగంలో సిబ్బంది వంట పనులు చేస్తున్నారు. దాతలు విరాళంగా సమకూర్చిన నీటిశుద్ధి పరికరం మరమ్మతులకు గురైంది. దీంతో దాతల ఆశయం నీరుగారినట్లయింది. ప్రవేశద్వారం ఇనుపగేటు అమర్చిన గోడ పగిలి ఏ క్షణమైనా కూలిపోయే ప్రమాదముంది.

భవనాలు శిథిలం..

ఆవరణలోనే సిబ్బంది కోసం నిర్మించిన భవనం శిథిలమై నిరుపయోగంగా ఉంది. పాఠశాల గదుల నిధుల సమస్యతో కనీస మరమ్మతులకు కూడా నోచుకోవడం లేదు. వైకాపా ప్రభుత్వ హయాంలో నాడు నేడు రెండోవిడత పనుల్లో వసతిగృహాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని ఊరించిన ప్రభుత్వం సంబంధిత ఉద్యోగులతో బ్యాంకు ఖాతాలను కూడా తెరిపించింది. ఆ తర్వాత ఎందుకనో ఆ ప్రతిపాదనల నుంచి వెనక్కు తగ్గడంతో పేద విద్యార్థినులకు నిరాశే మిగిలింది. విష పురుగులకు నిలయంగా మారిన పరిసరాలను బాగు చేయాలని విద్యార్థినులు తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇదే విషయమై వసతిగృహ సహాయ సంక్షేమాధికారి ముప్పిడి రాజు మాట్లాడుతూ తమ పరిధిలోని సమస్యలను తక్షణం పరిష్కరిస్తామన్నారు. మురుగు కాలువ పూడిక తొలగింపు కోసం పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. శిథిల భవనాల మరమ్మతుల కోసం ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పారు.



ఆవరణలో తుప్పలు

10 AM to 1 PM
మీమున్యాం.. మీకు తోడుగా..
జంగారెడ్డిగూడెం : 80085 74478
కొయ్యలగూడెం: 80085 74947
చింతలపూడి : 76759 19066

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే

సమస్య: చింతలపూడి పట్టణం గ్యాస్ గోదాం సమీపంలో పందులు నివాసాల మధ్య సంచరిస్తూ అపరిశుభ్రంగా మారుస్తున్నాయి. వ్యాధుల సీజన్ కావడంతో పందులను పట్టణానికి దూరంగా తరలించాలి. - **రాజకుమార్, స్థానికుడు.**

సమాధానం: గతంలో చాలా పందులు పట్టణానికి దూరంగా తరలించాం. వాటి యజమానులను గుర్తించి మరోసారి నోటీసులు ఇస్తాం. ప్రజలకు ఇబ్బంది లేకుండా చేస్తాం. - **రాజా, సచివాలయ కార్యదర్శి, చింతలపూడి**

లింగపాలెం, న్యూస్‌టుడే

సమస్య: లింగపాలెం- కొత్తపల్లి ప్రధాన రహదారిలో సరమ్మ పేరంటాళ్ల చెరువు కట్ట పక్కనే చిరు వ్యాపారస్తులు చెత్త వేస్తున్నారు. దుర్వాసనతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. - **పి.లక్ష్మణరావు, స్థానికుడు**

సమాధానం: పారిశుద్ధ్య పనులు చేపడతాం. - **రాంబాబు పంచాయతీ కార్యదర్శి లింగపాలెం**

దసరా ఉత్సవ కరపత్రాల ఆవిష్కరణ

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం పట్టణంలో కొలువైన వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి 21వ దసరా శరన్నవ రాత్రి మహోత్సవాలు కనుల పండువగా నిర్వహిస్తామని ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు టీవీఏ రామతారకం అన్నారు. ఈ మేరకు ఆలయ ప్రాంగణంలో దసరా ఉత్సవ కరపత్రాలను కమిటీ సభ్యులు గురువారం ఆవిష్కరించారు. అక్టోబరు 3 నుంచి 12వ తేదీ వరకు అమ్మవారు ప్రత్యేక అలంకరణలతో వివిధ అవతారాల్లో భక్తులకు దర్శనమిస్తారని ఆలయ ప్రధాన అర్చకులు మేడూరి నాగ వెంకటశర్మ తెలిపారు. అనంతరం 13వ తేదీ అఖండ అన్న సమారాధన నిర్వహిస్తారని అన్నారు. నవరాత్రుల్లో భాగంగా ప్రత్యేక కుంకుమ పూజలు, పుష్పార్చనలు, హోమాలు వంటి పూజాదికాలు వైభవోపేతంగా జరుగుతాయని అమ్మవారి దర్శనార్థం భక్తులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కర్పూరం జనార్దన్, మహంకాళి రామ్మోహనరావు, రాజా, శీమకుర్తి శ్రీను, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఉత్సవాల కరపత్రాలు చూపుతున్న కమిటీ సభ్యులు

వేధింపుల ఘటనలు పునరావృతం కానియ్యొద్దు



ప్రిన్సిపల్‌తో మాట్లాడుతున్న శ్రీనివాసులు

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: బుట్టాయగూడెం మండలం బూసరాజుపల్లి గిరిజన గురుకుల పాఠశాలలో పొరుగు సేవల పద్ధతిన పని చేస్తున్న చిత్ర లేఖన ఉపాధ్యాయుడు ఓ విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించి వేధింపులకు పాల్పడటం దారుణమని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ట్రైకార్ ఛైర్మన్, తెదేపా నియోజకవర్గం కన్వీనర్ బొరగం శ్రీనివాసులు కోరారు. కీచక ఉపాధ్యాయుడిపై శాఖాపరమైన చర్యలు తీసుకుని, శిక్షించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఇ.భూషణం, వినోద్, ఎస్.రామ్మోహన్ ఇన్‌ఛార్జి డీడీ నాయుడును కోరారు.

ట్రైకార్ ఛైర్మన్‌కు సత్కారం

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: రాష్ట్ర ట్రైకార్ ఛైర్మన్‌గా నియమితులైన తెదేపా నియోజకవర్గం కన్వీనర్ బొరగం శ్రీనివాసులును బూసరాజుపల్లిలోని క్యాంపు కార్యాలయంలో కూటమి నాయకులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. తెదేపా సీనియర్ నాయకుడు, మండల మాజీ అధ్యక్షుడు నల్లూరి కృష్ణమోహన్, భాజపా సీనియర్ నాయకుడు కరాటం వెంకటరెడ్డినాయుడు, జనసేన సీనియర్ నాయకుడు కరాటం ఉమామహేశ్వరరావు, నాయకులు గరికపాటి రవీంద్ర, కరిమికొండ శివాజీ, తెలుగు రైతు జిల్లా కార్యదర్శి గద్దే అబ్బులు తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా శ్రీనివాస్

పోలవరం, న్యూస్‌టుడే: పోలవరం తహసీల్దార్ కార్యాలయంలో ఇటీవల బదిలీపై వెళ్లిన ఉద్యోగుల స్థానంలో పలువురు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. డిప్యూటీ తహసీల్దార్‌గా కె.యు.శ్రీనివాస్, సీనియర్, జూనియర్ సహాయకులుగా శ్రీనివాసరావు, భీమరాజు, ప్రగడపల్లి వీఆర్వోగా ఎస్కే. షరీఫ్‌లు బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం తహసీల్దార్ సాయిరాజును మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

మంత్రులతో భేటీ

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో పలు సమస్యల పరిష్కారం కోరుతూ పోలవరం శాసనసభ్యుడు చిర్రి బాలరాజు రాష్ట్ర సచివాలయంలో వివిధ శాఖల మంత్రులను, అధికారులను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి వినతిపత్రాలను అందజేసినట్లు ఎమ్మెల్యే కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. మండల కేంద్రం కొయ్యలగూడెంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు, పోలీస్ స్టేషను మైదానంలో ప్రధాన రహదారి వెంబడి వాణిజ్య దుకాణ సముదాయ(షాపింగ్ కాంప్లెక్సు) నిర్మాణానికి కృషి చేయాలని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితకు ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో మాదక ద్రవ్యాలను నియంత్రించాలని విజ్ఞప్తి చేశారు. బాలికల పాఠశాలల్లో ఉపాధ్యాయులను, సిబ్బందిని మహిళలనే నియమించాలన్నారు. కేఆర్ పురం ఐటీడీఏకు పూర్తిస్థాయిలో ప్రాజెక్టు అధికారిని నియమించాలని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సుధారాణికి ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఐటీడీఏ అభివృద్ధికి మరిన్ని అదనపు నిధులు మంజూరు చేయాలని కోరడంతో మంత్రి సానుకూలత వ్యక్తం చేశారని తెలిపారు. గిరిజన అభ్యర్థుల కోసం డీఎస్సీ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించాలన్నారు. గిరిజన అభ్యర్థుల కోసం ప్రత్యేక డీఎస్సీని నిర్వహించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాలని మంత్రికి విజ్ఞప్తి చేసినట్లు ఆయన చెప్పారు. గిరిజన నిరుద్యోగుల ఉపాధి కల్పనకు చర్యలు చేపట్టాలని కోరారు. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ మైలవరపు వి.ఆర్.కృష్ణతేజను కలిసి నియోజకవర్గంలోని పంచాయతీలకు సంబంధించిన నిధులను త్వరితగతిన విడుదల చేయాలని విజ్ఞప్తి చేసినట్లు వివరించారు. ఎమ్మెల్యే వెంట జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం సాయి, జిల్లా కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్, తెదేపా రాష్ట్ర కార్యదర్శి జయవరపు శ్రీరామ్మూర్తి ఉన్నారు.



హోంమంత్రి అనితకు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

త్వరితగతిన పూర్తి చేయాలి



కూటమి నాయకులతో సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రోషన్ కుమార్

చింతలపూడి, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని గ్రామ గ్రామాన సీసీ రహదారులు, కాలువల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. నియోజకవర్గంలోని కూటమి నాయకులతో ఎమ్మెల్యే కార్యాలయంలో వీటి నిర్మాణంపై శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మండలానికి ఉపాధి హామీకి సంబంధించిన మెటీరియల్ కాంపోనెంట్ నిధులు విడుదలయ్యాయన్నారు. ఈ నిధులకు సంబంధించిన పనుల గుర్తింపు కూడా పూర్తయిందని సీసీ రహదారులు, కాలువల పనులను త్వరగా పూర్తి చేసేలా చూడాలన్నారు. పనుల నాణ్యతపై రాజీ పడొద్దన్నారు. ఎటువంటి సమస్య ఎదురైనా తన దృష్టికి తీసుకురావాలన్నారు.

విద్యకు ప్రథమ స్థానం

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో విద్యకు ప్రథమ స్థానం ఇవ్వాలని బంజారా భజరంగి భేరి నాయకులు అన్నారు. శుక్రవారం చింతలపూడి మండలం రేచర్ల అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండల అధ్యక్షుడు శివ నాయక్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ముఖ్యంగా ఎస్టీలు తమ చిన్నారులను పాఠశాలలకు పంపడంలో నిర్లక్ష్యంగా ఉంటున్నారని చెప్పారు. వారికి చదువులపై ఆసక్తిని పెంచి పాఠశాలలకు పంపితేనే రేపు వారి భవిష్యత్తు బాగుంటుందన్నారు. విద్యార్థుల చదువులకు ఆటంకం లేకుండా బంజార భజరంగి భేరి సంఘం ఎప్పుడూ సహకరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు చలం నాయక్, వెంకన్న బాబు, రమేశ్, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

అవి ఇవి అన్నీ

అంతర్జాల ఆటలతో జీవితాలు నాశనం చేసుకోవద్దు.. పోలవరం, న్యూస్‌టుడే: అంతర్జాల ఆటలతో జీవితాలను నాశనం చేసుకోవద్దని విద్యార్థులకు పోలవరం సీఐ బాల సురేశ్ బాబు సూచించారు. పోలవరం మండలం చేగొండపల్లి ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. చరవాణుల వల్ల బయట జరుగుతున్న మోసాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. ఆయన వెంట ఎస్సై పవన్‌కుమార్ ఉన్నారు.

పిల్లలకు నగదు బహుమతి.. పోలవరం, న్యూస్‌టుడే: పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1976-77వ సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న వారిలో ఒకరైన పీవీ కృష్ణ జ్ఞాపకార్థం పూర్వ విద్యార్థులందరూ కలిసి శుక్రవారం పాఠశాలలో కార్యక్రమం నిర్వహించారు. వారిలో ఒకరైన డాక్టర్ నేతల రాజు గత సంవత్సరం పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు ఆరు వేలు అందజేశారు.

పరిహారం ఎప్పటికి ?.. పోలవరం, న్యూస్‌టుడే: మిగ్‌జాం తుపానుకు సంబంధించి మిగిలిపోయిన పరిహారం ఎప్పటికి ఇస్తారని పలువురు రైతులు గ్రామానికి వెళ్లిన వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు పి.బుజ్జిబాబును ప్రశ్నించారు. పోలవరం మండలం కొత్త పట్టిసీమ గ్రామ సచివాలయం వద్ద సహాయ సంచాలకుడిని పలువురు రైతులు కలిసి జాబితాలో చూస్తే మా పేర్లు ఉన్నాయన్నారు. దీనిపై వ్యవసాయ శాఖాధికారి రాంబాబును జాబితాను బయటకు తీయాలని ఆదేశించారు.

పోలీసు అధికారుల పల్లె నిద్ర.. చింతలపూడి, న్యూస్‌టుడే: 'పల్లె నిద్ర' కార్యక్రమంలో భాగంగా జంగారెడ్డిగూడెం డీఎస్పీ రవిచంద్ర, సీఐ రవీంద్ర, ఎస్సై కుటుంబరావులు మండలంలోని యర్రగుంటపల్లి పంచాయతీ కార్యాలయంలో గురువారం రాత్రి నిద్రించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో సమావేశం నిర్వహించారు.

పోషకాహార మాసోత్సవాలు.. ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకా తిరుమల ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార మాసోత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. 100 రోజుల కార్యక్రమం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు పోషకాహారాన్ని సానుకూలంగా తీసుకోవాలన్నారు. మీ పిల్లలను రక్షించుకునే మంచి అవకాశం మీ చేతిలోనే ఉందని సూచించారు. అలాగే మండలంలోని ఎం.నాగులపల్లిలో ఎనీమియా నివారణ, తీసుకోవల్సిన ఆహార పదార్థాలు, జాగ్రత్తలు అనే అంశంపై పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమణారావు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఎం.నాగులపల్లిలో పోషకాహారంపై అవగాహన

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి.. జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఇటీవల ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య రాష్ట్ర కమిటీ సభ్యుడు సాలి రాజశేఖర్ అన్నారు. జంగారెడ్డిగూడెం ఆర్డీవో కార్యాలయంలో మేరకు శుక్రవారం వినతి పత్రాన్ని అందించారు. ప్రభుత్వ అన్ని ప్రధాన పంటలకు గిట్టుబాటు ధర ప్రకటించేంత వరకూ పోరాడుతూనే ఉంటామని అన్నారు.

హైస్కూల్ ఆవరణలో పోలీసు పరేడ్.. జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: పోలీసులు తమ వృత్తిని గౌరవప్రదంగా భావించి అంకిత భావంతో పనిచేయాలని జంగారెడ్డిగూడెం సీఐ కృష్ణబాబు అన్నారు. జంగారెడ్డిగూడెం పట్టణంలోని హైస్కూల్ ఆవరణలో పోలీసు పరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పోలీసులు శారీరక దృఢత్వం కలిగి ఉండాలని అన్నారు. వ్యాయామాలు, క్రీడల వల్ల ఒత్తిడి దూరమై మానసిక ఉల్లాసం కలుగుతుందని అన్నారు. కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం ఎస్సై జబీర్, ట్రాఫిక్ ఎస్సై రామకృష్ణ, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులకు సహకరించాలి

జీలుగుమిల్లి, న్యూస్‌టుడే: మండలాభివృద్ధికి సమన్వయంతో పని చేయాలని ఎంపీపీ కోర్స పోసమ్మ అన్నారు. మండల పరిషత్తు సమావేశ మందిరంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అభివృద్ధి కోసం అన్ని శాఖల అధికారులు ప్రజాప్రతినిధులకు సహకరించాలని సూచించారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. సీసీ రహదారులు, కాలువల నిర్మాణానికి నిధులు మంజూరయ్యేలా చర్యలు చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు నాలి శ్రీను, సున్నం సురేశ్, సుధారాణి, సర్పంచులు జగ్గారావు, పార్వతి, ఎంపీడీవో కృష్ణప్రసాద్, ఏంఈవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోలవరం వీధుల్లో వర్షపు నీరు

పోలవరం, న్యూస్‌టుడే: పోలవరం మండలంలో శుక్రవారం తెల్లవారుజాము నుంచి కురిసిన కుండ పోత వర్షానికి పోలవరం గ్రామంలోని కమ్మరగూడెం, పాతనూతనగూడెం, బీసీకాలనీ, కొత్తపేట కాలనీల పరిధిలోని వీధులు, సామాజిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లే రహదారి జలమయం కావడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. ఎక్కడికక్కడ నీరు వెళ్లే మార్గాలకు అడ్డంకులు కారణంగా తరచూ నీరు నిలిచిపోతోందని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాల ఆవరణ వర్షపు నీటితో నిండింది. అక్కడే అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తున్నారు. రోజుల తరబడి ఆవరణలో నీరు నిలిచిపోవడంతో ఉపాధ్యాయులతో పాటు అంగన్‌వాడీ సిబ్బంది పిల్లలు నీటిలో ఎక్కడ దిగుతారో అన్న భయం వారిని వెంటాడుతోంది. మరో వైపు సున్నాలగండి, పేడ్రాల వాగులు మైదాన ప్రాంతాలకు చేరుతున్నాయి. సున్నాలగండి వాగు కడెమ్మ కాలువలో కలిసి పోలవరంలోని కడెమ్మ అవుట్‌ఫాల్ స్లూయిజ్ ద్వారా గోదావరిలోకి వెళ్తోంది. పేడ్రాల వాగు కొవ్వాడ కాలువలో కలుస్తుంది. ఆ నీరంతా పట్టిసీమ వద్ద నిర్మించిన అవుట్‌ఫాల్ స్లూయిజ్ గోదావరిలో చేరుతుంది. పోలవరం తహసీల్దార్ కార్యాలయంలో 22.2 మి.మీ వర్షపాతం నమోదైంది.



ఎంపీయూపీ పాఠశాల ఆవరణలో నిలిచిన నీరు

కార్మికుల వేతన బకాయిలు చెల్లించాలి

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: సత్యసాయి తాగునీటి పథకంలో పని చేసే కార్మికుల వేతన బకాయిలను వెంటనే విడుదల చేయాలని కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు డేగా ప్రభాకర్ డిమాండ్ చేశారు. సత్యసాయి తాగునీటి పథకం జిల్లా కార్మిక సంఘం మూడో మహాసభ సందర్భంగా కొయ్యలగూడెం వినాయకుని గుడి వద్ద నుంచి మార్కెట్ యార్డు వరకు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ జరిగిన సభలో ప్రభాకర్ మాట్లాడుతూ ఏడు నెలలు నుంచి కార్మికులకు వేతనాలు ఇవ్వకపోవడం వల్ల వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నాయన్నారు. ప్రభాకర్‌ను కార్మిక సంఘం నాయకులు సతీశ్, బాలాజీ, ప్రసాదు, వీరబాబు సత్కరించారు.



ప్రభాకర్‌ను సత్కరిస్తున్న నాయకులు

పంటల బీమా పథకం అమలు చేయాలి.. కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: కేంద్రం ప్రభుత్వం పంటల బీమా పథకం అమలు చేసి వారిని ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ డిమాండ్ చేశారు. కొయ్యలగూడెం సీపీఐ కార్యాలయం వద్ద మండల ముఖ్య నాయకులతో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వ లెక్కల ప్రకారం ప్రతి 45 నిముషాలకు ఒక రైతు చొప్పున ఆత్మహత్యకు పాల్పడుతున్నారన్నారు. రైతు రుణాలను మాఫీ చేసి వారిని ఆర్థికంగా ఆదుకోవాలన్నారు. సీపీఐ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు పాల్గొన్నారు.




ప్రదర్శనలో పాల్గొన్న అధికారులు

శ్రీవారి కొండపై 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమం

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకా తిరుమలలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పర్యాటక రంగ సంస్థ ఆదేశాల మేరకు ప్రపంచ పర్యాటక దినోత్సవం, స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి సుబ్బారావు, దేవస్థానం ఏఈవో నటరాజారావు, సెట్‌వెల్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ప్రభాకరరావు యువతతో మానవహారం ఏర్పాటు చేసి స్వచ్ఛతా హీ సేవా ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మొక్కలు నాటారు. అనంతరం సుబ్బారావు మాట్లాడుతూ అనేక పర్యాటక ప్రాంతాలు ఉన్న ఏలూరు జిల్లాలో ఇటువంటి కార్యక్రమాలు చేయడం ఆనందదాయకమన్నారు. పర్యాటక ప్రదేశాల్లో కలెక్టర్ సూచన మేరకు భవిష్యత్తులో అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించే విధంగా ప్రణాళికలు రూపొందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పర్యాటక శాఖ మేనేజర్ పట్టాభిరామన్న, మండల స్పెషల్ ఆఫీసర్ నెహ్రూ, తహసీల్దారు సుబ్బారావు, ఎంపీడీవో ఎ.సుబ్బరాయన్ తదితరులు పాల్గొన్నారు.

సంఘాభివృద్ధికి అందరి సహకారం అవసరం

టి.నరసాపురం, న్యూస్‌టుడే: సహకార సంఘాభివృద్ధికి రైతులు, ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులందరి సహకారం అవసరమని కేతవరం సహకార సంఘం ఛైర్‌పర్సన్ సీట్ల లక్ష్మణరావు అన్నారు. ఆ సంఘ మహాజన సభ శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న పలువురు రైతులు మాట్లాడుతూ సంఘం రైతులకు రుణాలు ఇవ్వడమే కాకుండా సక్రమంగా వసూలు చేయాలని సూచించారు. అల్లంచర్లరాజుపాలెం పంచాయతీలో రైతులకు రైతు బంధు, రైతు నేస్తం రుణాలు ఇవ్వకపోవడంపై రైతులు వివరణ కోరారు. దానిపై ఛైర్‌పర్సన్ లక్ష్మణరావు మాట్లాడుతూ ఆ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్తామని, వారి నిర్ణయం అనంతరం రుణాలు అందిస్తామని తెలిపారు. సంఘ సీఈవో తనగాల వీరవెంకయ్య జమా ఖర్చుల వివరాలు సభలో ఉంచారు. కార్యక్రమంలో జిల్లా ప్రాదేశిక మాజీ సభ్యుడు నల్లూరి చలపతిరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు, అధికారులు

కీచక ఉపాధ్యాయుడిని ఉద్యోగం నుంచి తొలగించాలని నిరసన

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: బుట్టాయగూడెం మండలం బూసరాజుపల్లి గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో ఒక విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించి, వేధింపులకు పాల్పడిన చిత్ర లేఖన ఉపాధ్యాయుడు జక్కుల మురళీకృష్ణను ఉద్యోగం నుంచి తొలగించి, కఠినంగా శిక్షించాలని ఆదివాసీ ఐకాస జిల్లా ఛైర్మన్ మొడియం శ్రీనివాసరావు కోరారు. ఆయన నేతృత్వంలో ఐకాస, ఆదివాసీ సంక్షేమ పరిషత్తు నాయకులు, పలువురు సర్పంచులు శుక్రవారం రాత్రి పాఠశాలను సందర్శించి వివరాలు సేకరించారు. అనంతరం పాఠశాల ఎదుట నిరసన తెలిపారు. ఐకాస జిల్లా ప్రధాన కార్యదర్శి సోదెం ముక్కయ్య, జిల్లా కార్యదర్శి తెల్లం లక్ష్మణరావు, ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు తెల్లం రాములు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించాలి: డీఏవో

టి.నరసాపురం, న్యూస్‌టుడే: అల్లంచర్లరాజుపాలెంలోని విత్తనాభివృద్ధి క్షేత్ర భూమిలో ఆక్రమణలు వెంటనే తొలగించాలని జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా అన్నారు. ఆ ప్రాంతాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా చుట్టుపక్కల రైతులతో మాట్లాడుతూ ఆక్రమణదారులు వెంటనే తొలగకుంటే చట్టపర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెవెన్యూ అధికారులను కలిసి విత్తనాభివృద్ధి క్షేత్ర భూమిలో ఆక్రమణ దారులకు నోటీసులు ఇవ్వాలని కోరారు. అనంతరం ఈ ఖరీఫ్ సీజన్‌లో విత్తనాభివృద్ధి కోసం వేరుశనగ సాగు ప్రారంభించాలని వ్యవసాయ శాఖాధికారులకు సూచించారు. సర్పంచి నార్ని వెంకట్రావు, చింతలపూడి వ్యవసాయ సహాయ సంచాలకుడు నాగకుమార్, ఏవో సుమలత, సిబ్బంది పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రం ప్రారంభం

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: చెత్త నుంచి సంపద సృష్టించవచ్చని మండల విస్తరణాధికారి ఎం.నాగిరెడ్డి అన్నారు. జంగారెడ్డిగూడెం మండలం పేరంపేట గ్రామంలో 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమంలో భాగంగా సంపద తయారీ కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. వర్మీ కంపోస్టు తయారీకోసం తొట్టెలోకి వానపాములను విడుదల చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి కంకిపాటి కుమారి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజూ కొనసాగిన ఆందోళన

టి.నరసాపురం, న్యూస్‌టుడే: టి.నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వేధింపులకు గురై ఉద్యోగ బహిష్కరణకు గురైన ఆశా కార్యకర్త లక్ష్మీ మంగను విధుల్లోకి తీసుకుని, ఆమెపై లైంగిక వేధింపులకు పాల్పడిన సీహెచ్‌వో నాగబాబుపై చర్యలు తీసుకోవాలంటూ ఆశా కార్యకర్తలు ఆ పీహెచ్‌సీ వద్ద కొనసాగిస్తున్న ఆందోళన శుక్రవారం రెండో రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తలు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు నిత్యం సేవలందిస్తున్న తాము రాజకీయ నాయకులు, అధికారుల ఒత్తిళ్లతో ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జ్యోతి, వనిత, విజయలక్ష్మి, దేవమాత, కృష్ణ లీల తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంపై కేసు

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంపై జంగారెడ్డిగూడెం పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఎస్సై జబీర్ కథనం మేరకు... కొయ్యలగూడెం మండలం దిప్పకాయలపాడు గ్రామానికి చెందిన పదిలం సురేశ్ ట్రాక్టర్ చోదకుడిగా పనిచేస్తున్నాడు. ఈ నెల 25న సురేశ్ తన ద్విచక్రవాహనంపై జంగారెడ్డిగూడెం వచ్చి తిరిగి స్వగ్రామం వెళ్తుండగా ఏలూరు రోడ్డులోని ఆటోనగర్ చర్చి సమీపానికి వచ్చేసరికి... మితిమీరిన వేగంతో వచ్చిన మరో ద్విచక్రవాహనం సురేశ్‌ను ఎదురుగా ఢీకొట్టింది. దీంతో కింద పడిపోయిన సురేశ్‌కు తీవ్ర రక్త గాయాలు అవడంతో స్థానికులు జంగారెడ్డిగూడెం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. దీనిపై క్షతగాత్రుడు సురేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న బెల్లం పట్టివేత

అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: అక్రమంగా తరలిస్తున్న బెల్లాన్ని అధికారులు పట్టుకున్నారు. ఎక్సైజ్ సీఐ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రా నుంచి తెలంగాణలోకి భారీగా బెల్లం తరలిస్తున్నారన్న సమాచారంతో అశ్వారావుపేట సరిహద్దు చెక్‌పోస్టు వద్ద శుక్రవారం నిఘా పెట్టారు. ఎస్సై రాజేశ్వరరావు ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. జంగారెడ్డిగూడెం నుంచి వచ్చిన బోలేరా వాహనంలో 2,916కిలోల బెల్లాన్ని గుర్తించి వాహనాన్ని సీజ్ చేసి స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. ఈ బెల్లం విలువ సుమారు రూ.1.5 లక్షలు ఉంటుందని, దీన్ని తరలిస్తున్న జంగారెడ్డిగూడేనికి చెందిన మాణిక్యాల సురేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు. ఈ బెల్లాన్ని అశ్వారావుపేట మండలంతోపాటు ఆంధ్రాలోని వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో విక్రయించేందుకు తరలిస్తున్నారని పేర్కొన్నారు.

జూద స్థావరంపై పోలీసుల దాడి

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకా తిరుమల మండలం పంగిడిగూడెంలో జూద స్థావరంపై పోలీసులు శుక్రవారం దాడి చేశారు. 11 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.15 వేలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సుధీర్ తెలిపారు.

నూజివీడు

• నూజివీడు • కైకలూరు

మాదక ద్రవ్యాలతో భవిత చిత్తు

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: మాదక ద్రవ్యాలు వినియోగించడంతో బంగారు భవిష్యత్తు నాశనం అవుతుందని జి.శేఖర్‌బాబు అన్నారు. నవ జీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో ఆగిరిపల్లిలో శుక్రవారం మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల వినియోగాన్ని రూపుమాపేందుకు అందరూ సామాజిక బాధ్యతతో ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.రాగమయి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శేఖర్‌బాబు

కొల్లేరును పర్యాటకంగా అభివృద్ధి చేయాలి

మండవల్లి, న్యూస్‌టుడే: కొల్లేరును పర్యాటకంగా అభివృద్ధి చేసి ఇక్కడ జీవిస్తున్న ప్రజల స్థితిగతులను మార్చాల్సిన అవసరం ప్రభుత్వాలపై ఎంతైనా ఉందని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు బొడ్డు రాబర్ట్, అప్పారావు అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని మండవల్లిలో అవగాహన ర్యాలీ చేశారు. విచ్చలవిడిగా విస్తరిస్తున్న ఆక్వా సాగుతో కొల్లేరు తీవ్ర కాలుష్యకోరల్లో చిక్కుకుంటుందన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఐక్య వేదిక సభ్యులు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నూజివీడు: 99486 40551 | కైకలూరు: 73060 88555
ముసునూరు: 93983 81268 | కలిదిండి: 90594 84862

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే

సమస్య: నూజివీడు పట్టణం సిద్ధార్థ బీ ఫార్మసీ కళాశాల సమీపంలో కొన్ని రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. **- రాజేష్, నూజివీడు**

సమాధానం: వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. **- లక్ష్మీనారాయణ, మున్సిపల్ డీఈ**

కలిదిండి, న్యూస్‌టుడే

సమస్య: గ్రామంలో రక్షిత మంచినీటి పథకం ద్వారా కలుషిత నీరు సరఫరా చేస్తున్నారు. తాగడానికి పనికిరాని విధంగా ఉంటున్నాయి. **- రాజు, సానారుద్రవరం**

సమాధానం: శుద్ధి చేసిన మంచినీటినే సరఫరా చేస్తున్నాం. మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటాం. **- రాఘవేంద్రరావు, పంచాయతీ కార్యదర్శి**

కైకలూరు, న్యూస్‌టుడే

సమస్య: మండలంలోని సింగాపురం ఎంపీపీ పాఠశాల వద్ద పంచాయతీ వీధి దీపం సక్రమంగా వెలగడం లేదు. దీంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. **- మోహన్, సింగాపురం**

సమాధానం: వెలగని వీధి దీపాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తాం. **- రవిశంకర్, ఈవోపీఆర్డీ, కైకలూరు**

ప్రయాణం.. నరకప్రాయం

అధ్వానంగా దెయ్యంపాడు- గోపాలపురం రహదారి

మండవల్లి, న్యూస్‌టుడే: దెయ్యంపాడు- గోపాలపురం రహదారి దారుణంగా తయారయ్యింది. పది గ్రామాలను కలిపే 14 కిలోమీటర్ల రోడ్డును పదేళ్ళ కిందట రూ.9 కోట్ల వ్యయంతో నిర్మించారు. రోడ్డుకు ఒక పక్క మోటారు కాలువ ఉండటంతో పాటు రోడ్డు నిర్మాణంలో సరైన నిబంధనలు పాటించకపోవడంతో మొదటి నుంచే రోడ్డు మరమ్మతులకు గురవుతూ వచ్చింది. దీంతో పాటు సామర్థ్యానికి మించిన లోడులతో భారీ వాహనాలు వెళ్లడంతో ప్రస్తుతం రోడ్డు మొత్తం కుంగిపోయి దారుణంగా పెద్దపెద్ద గోతులతో దర్శనమిస్తోంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డుపై ఏర్పడిన భారీ గోతుల్లో నీరు చేరడంతో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా నుచ్చుమిల్లి, ఆనందపురం, నాగభూషణపురం, మూలపేట గ్రామాల్లో రోడ్డు పరిస్థితి మరింత దిగజారిపోయింది. రోడ్డుపై ఎదురెదురుగా వచ్చే వాహనాలను తప్పించే వీలు లేకపోవడంతో దూరంగా నిలిపి వేసి ఒకటి వచ్చిన తర్వాత రెండో వాహనం వెళ్ళాల్సిన పరిస్థితి. ఈవిషయమై రోడ్లు, భవనాల శాఖ ఏఈ విజయశ్రీకర్‌ను సంప్రదించగా.. త్వరలో మరమ్మతులకు అంచనాలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు.



రోడ్డుపై భారీ గోతులు

ఇరుక్కుపోయిన లారీ: ఐబీపేట నాగభూషణపురం వద్ద లారీ రోడ్డుపైనే గొయ్యిలో ఇరుక్కుపోవడంతో నానా ఇబ్బందులు పడి దానిని బయటకు తీశారు. తరచూ రోడ్డుపై వాహనాలు ఇరుక్కుపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇక రాత్రివేళల్లో ప్రయాణికుల పడే ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ఇప్పటికే గోతుల్లో పడి పదుల సంఖ్యలో వాహనదారులు ఆసుపత్రుల పాలయ్యారు. దీనిపై వెంటనే చర్యలు తీసుకుని రోడ్డుకు మరమ్మతులు చేయాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



మానవత్వం చూపిన మంత్రి

నూజివీడు, న్యూస్‌టుడే: రహదారి ప్రమాదంలో గాయపడిన మహిళపై మంత్రి మానవత్వం చూపిన ఘటన శుక్రవారం నూజివీడులో జరిగింది. చాట్రాయి మండల పర్యటన అనంతరం నూజివీడు వస్తున్న మంత్రి తుమ్మలపల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదం చూసిన వెంటనే స్పందించారు. మంత్రి వాహనం దిగి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మెర్సీ పూడి వెంకట కె.సాల్మె అనే మహిళను ప్రత్యేక వాహనంలో నూజివీడు ఏరియా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ నరేంద్ర సింగ్‌కు ఫోన్ చేసి ప్రమాదంలో గాయపడిన మహిళకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు.



ఘటనా స్థలంలో పార్థసారథి

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: నూజివీడు పట్టణం బంగినపల్లితోట ప్రాంతంలో కొత్త విద్యుత్తు తీగల ఏర్పాటు చేయడానికి ఆదివారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం అయిదు గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్తు డీఈ సత్యనారాయణ తెలిపారు.

ఆగిరిపల్లి ఏపీఎంగా రాజశేఖర్

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ఆగిరిపల్లి వెలుగు కార్యాలయం ఏపీఎంగా దయాల రాజశేఖర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన నూజివీడు నుంచి బదిలీపై ఆగిరిపల్లి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న బొలగాని రామకృష్ణ ఎన్టీఆర్ జిల్లా రెడ్డిగూడేనికి బదిలీ అయ్యారు.

పంచాయతీరాజ్ ఉద్యోగుల బదిలీ..

ఆగిరిపల్లి ఈవోపీఆర్డీ చిట్టిపోతుల శేఖర్ మండవల్లి బదిలీ అయ్యారు. అక్కడ పనిచేస్తున్న బి.ఆనందబాబు ఆగిరిపల్లికి రానున్నారు. వట్టిగుడిపాడు పంచాయతీ కార్యదర్శి షేక్ మీర్జావలి ఎన్టీఆర్ జిల్లా జుజ్జూరుకు, నూగొండపల్లి పంచాయతీ కార్యదర్శి సీహెచ్ పుల్లారావు కృష్ణా జిల్లా మోపర్రుకు, అడవినెక్కలం పంచాయతీ కార్యదర్శి మల్లెల శ్రీనివాసరావు కృష్ణాజిల్లా బొమ్మినంపాడుకు, కలటూరు పంచాయతీ కార్యదర్శి నక్కనబోయిన కృష్ణవేణి కృష్ణాజిల్లా జామిదంత కర్రుకు బదిలీ అయ్యారని ఇన్‌ఛార్జి ఎంపీడీవో అబ్దుల్ సలాం శుక్రవారం తెలిపారు.

కార్మికులకు వసతులు కల్పించాలి

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: దుకాణాల్లో పని చేస్తున్న కార్మికులకు యాజమాన్యం అన్ని వసతులు కల్పించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్ సూచించారు. ఏలూరు నగరంలోని దుకాణాల్లో పని చేస్తున్న కార్మికులకు శుక్రవారం కార్మిక చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా కార్మికుల వ్యక్తిగత భద్రతపై యాజమాన్యం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాలు పొందేందుకు వివరాలను కార్మిక శాఖాధికారి కార్యాలయంలో నమోదు చేసుకోవాలని సూచించారు.

సమన్వయంతోనే సమస్యల పరిష్కారం

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: అధికారులు సమన్వయంతో పనిచేసి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణిదుర్గ అన్నారు. మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఆమె అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. గతంలో వాయిదా పడిన 65 అంశాలను కౌన్సిల్ సభ్యులు అందరూ ఆమోదించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు రామిశెట్టి మురళీకృష్ణకుమార్, తెదేపా ఫ్లోర్ లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్, పగడాల సత్యనారాయణ, కొమ్ము వెంకటేశ్వరరావు, కందుల సత్యనారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న త్రివేణిదుర్గ

కూటమి ప్రభుత్వంలో అందరికీ మేలు

ముసునూరు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అందరికీ మంచి రోజులు వచ్చాయని తెదేపా నాయకులు కేశవరావు అన్నారు. శుక్రవారం లోపూడి పంచాయతీ బాసవరప్పాడులో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వంద రోజుల్లో ప్రభుత్వం అమలు చేసిన పథకాలను కరపత్రాలు అందజేసి వివరించారు. కార్యక్రమంలో పొన్నగంటి వేణు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



కరపత్రాలు ప్రదర్శిస్తున్న నాయకులు

ఇస్రో నమూనాల ప్రదర్శన

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: నూజివీడు పట్టణంలోని సెయింట్స్ థామస్ హైస్కూల్ ఆవరణలో డీవైఈవో సేవ్యా నాయక్ శుక్రవారం ఇస్రో కార్యకలాపాలు తెలిపే ప్రత్యేక బస్సు ప్రదర్శనను ప్రారంభించారు. స్థానిక బస్టాండ్ నుంచి ఆ బస్సును డీఏఆర్ కళాశాల వరకు ఎన్‌సీసీ విద్యార్థులు ప్రదర్శనగా తీసుకొచ్చారు. ఇస్రో పనితీరు, ఉపగ్రహాల ప్రయోగం, రాకెట్లు, చంద్రయాన్, పీఎస్ఎల్‌వీ వంటి నమూనాలను ప్రదర్శించారు. ఏలూరు జిల్లా సమన్వయకర్త వెంకటేశ్వరరావు ప్రదర్శనలను విద్యార్థులకు వివరించారు. పట్టణ పరిధిలోని పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు ఉత్సాహంగా తిలకించారు. ఉపాధ్యాయులు ప్రసాద్, శ్యాంబాబు, అవినాశ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



తిలకిస్తున్న విద్యార్థులు

కైకలూరు గ్రామీణ సీఐగా రవికుమార్

కైకలూరు, న్యూస్‌టుడే: కైకలూరు గ్రామీణ సీఐగా వి.రవికుమార్ స్థానిక పోలీస్ సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. జిల్లా ట్రాన్స్‌కో విజిలెన్స్‌లో పనిచేసిన ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సామాజిక మాధ్యమాల్లో వచ్చే పార్ట్‌టైం ఉద్యోగాల లింకులు వంటి వాటిపై ఆకర్షితులై సైబర్ నేరగాళ్ల బారిన పడొద్దని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో జూదం వంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



పెద్దింట్లమ్మ దేవస్థాన ఈవోగా శ్రీనివాసరావు

కైకలూరు, న్యూస్‌టుడే: కైకలూరు మండలం కొల్లేటికోటలోని పెద్దింట్లమ్మ అమ్మవారి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా కూచిపూడి శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా హనుమాన్ జంక్షన్ నుంచి ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన ఈవో కేవీ గోపాలరావు కృష్ణాజిల్లా గుడివాడ భీమేశ్వరస్వామివారి దేవస్థానానికి బదిలీ అయ్యారు.



సనాతన ధర్మం పరిరక్షణ ర్యాలీ నేడు

కలిదిండి, న్యూస్‌టుడే: తిరుమల పవిత్రత, సనాతన ధర్మ పరిరక్షణ కాంక్షిస్తూ కోరుకొల్లులోని శ్రీవేంకటేశ్వరాలయం, కార్యసిద్ధి దత్త సాయి మందిరం, మురళీకృష్ణ ఆశ్రమం ఆధ్వర్యంలో శనివారం ఉదయం 9 గంటలకు ర్యాలీ నిర్వహించనున్నట్లు విశ్రాంత ఎస్పీ చన్నంశెట్టి చక్రపాణి శుక్రవారం తెలిపారు. దీనిని అందరూ విజయవంతం చేయాలని కోరారు.

బాధ్యతల స్వీకరణ

ముదినేపల్లి, న్యూస్‌టుడే: చేవూరుపాలెం- సింగరాయపాలెం సెంటరులోని శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ సహాయ కమిషనర్‌గా శుక్రవారం ఆర్.గంగాశ్రీదేవి బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ సీవీ రెడ్డి ఛారిటీస్ ఏసీగా పనిచేస్తున్న ఆమె ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన నేల సంధ్య నెమలి వేణుగోపాలస్వామి ఆలయానికి బదిలీ అయ్యారు. శుక్రవారం స్వామివారిని దర్శించుకున్న అనంతరం ఆమె బాధ్యతలు స్వీకరించారు.

వదలని వాన.. తగ్గని నీరు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: ఖరీఫ్ సాగుకు వర్షం గండం వీడటం లేదు. ఈ నెల మొదట్లో కురిసిన భారీ వర్షాలతో ఏర్పడిన వరదకు వేలాది ఎకరాల పంట పొలాలు నీట మునిగాయి. ఇప్పుడిప్పుడే ఆ మురుగు బయటకు వెళ్లి పంటలు కోలుకుంటున్నాయి. ఈ తరుణంలో గత వారం రోజులుగా వరుసగా వర్షాలు కురుస్తుండటంతో పొలాల్లో నీటి మట్టం పెరుగుతోంది. వాటిని బయటకు తోడుకోవడానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారు.



ముదినేపల్లిలో..

పెదపాలపర్రులో ఇంకా తగ్గని నీరు

గ్రావెల్ అక్రమ తవ్వకాల అడ్డగింత

ముసునూరు, న్యూస్‌టుడే: ముసునూరు మండలం చిల్లబోయినపల్లి రెవెన్యూ భూమిలో ఎటువంటి అనుమతులు లేకుండా గ్రావెల్‌ను అక్రమంగా తవ్వుతున్న వారిని శుక్రవారం స్థానికులు అడ్డుకుని తహసీల్దార్ కె.రాజ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. వీఆర్వో సురేశ్ సంఘటనా స్థలానికి వెళ్లి జేసీబీని స్వాధీనం చేసుకున్నారు. అధికారుల రాకను గమనించిన పలువురు మూడు లారీలతో పరారైనట్లు సమాచారం. పట్టుకున్న జేసీబీని పోలీస్‌స్టేషన్‌కు తరలించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు.



స్వాధీనం చేసుకున్న జేసీబీ

హిందీ గొప్పతనం గుర్తించాలి

నూజివీడు, న్యూస్‌టుడే: ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన హిందీ భాష గొప్పతనాన్ని సమాజంలో ప్రతి ఒక్కరూ గుర్తించాలని హెచ్‌ఎం డా.భాగవతుల హేమలత అన్నారు. నూజివీడులోని ఎస్ఆర్ఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం హిందీ మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. హిందీ భారతీయ భాష అని, ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందిందని వివరించారు. కార్యక్రమంలో బాషా, అప్పారావు, బి.ప్రసాద్, ఎం.పద్మ, అబ్దుల్ హక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హేమలత

'అయిదేళ్లలో దార్శనిక ప్రణాళిక' పోటీలు

ముసునూరు, న్యూస్‌టుడే: ముసునూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్వర్ణాంధ్ర-2047 సాధించేందుకు రాబోయే అయిదేళ్లలో దార్శనిక ప్రణాళిక అనే అంశంపై అన్ని యాజమాన్య పాఠశాలల్లోని ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, చర్చ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పోటీల్లో ముసునూరు బాలికల గురుకుల పాఠశాల విద్యార్థిని సీహెచ్.సాయివర్షిణి, వ్యాసరచన పోటీల్లో మొదటిస్థానం సాధించింది. వక్తృత్వం పోటీల్లో చెక్కపల్లి చైతన్య పాఠశాల విద్యార్థి ఎం.పూజిత్ మొదటి స్థానం, చర్చలో కాట్రేనిపాడు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థిని కె.నాగమానస మొదటి స్థానం సాధించినట్లు ఎంఈవో బీవీఎస్ సుబ్బారావు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఎం.సునీలా, వివిధ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

సారా స్థావరంపై దాడి

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: సారా తయారీ, రవాణా, విక్రయాలు చేసే వారిపై ప్రత్యేక నిఘా పెట్టామని, నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్సై కె.శుభశేఖర్ హెచ్చరించారు. ఆగిరిపల్లి మండలం సీతారామపురంలో శుక్రవారం పోలీసులు నిర్వహించిన దాడుల్లో సారా బట్టీలు నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి 20 లీటర్ల సారా, 500 లీటర్ల బెల్లపు ఊట, గ్యాస్ పొయ్యి, బండ, ప్లాస్టిక్ డ్రమ్ములను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఏఎస్సై టి.నాయక్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: నూజివీడు పట్టణంలోని కోర్టు భవనాల వద్ద న్యాయవాదులు నూజివీడు బార్, భారత్ బార్, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. నూజివీడు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇందుపల్లి సత్యప్రకాశ్ మాట్లాడుతూ.. అడ్వకేట్ చట్టం సవరణ చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నించడంతో న్యాయవాదుల వ్యవస్థ నిర్వీర్యం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ చట్టం సవరణ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కు తీసుకునే వరకు తమ పోరాటం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఆర్‌వి సత్యనారాయణ, మడుపల్లి మధు రవిశంకర్, గోళ్ల ప్రసాద్, గోవాడ నీలాంబరం, మడుపల్లి బసవరావు, శ్రీనివాస రెడ్డి, చంద్రశేఖర్, నండూరి పద్మాంజలి తదితరులు పాల్గొన్నారు.



వేతనాలు పెంచాలని ఆందోళన

నూజివీడు, న్యూస్‌టుడే: పౌరసరఫరాల శాఖలో పనిచేసే హమాలీ కూలీల వేతనాలు పెంచాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు చలసాని వెంకట రామారావు డిమాండ్ చేశారు. ఏపీ పౌరసరఫరాల కార్పొరేషన్ మండల స్టాక్ పాయింట్లలో లోడింగ్, అన్‌లోడింగ్ పాయింట్లలో పనిచేసే కార్మికులకు కూలి పెంచాలని రాష్ట్రవ్యాప్త నిరసనలో భాగంగా స్థానిక పౌరసరఫరాల శాఖ గోడౌన్ దగ్గర శుక్రవారం నిరసన తెలిపారు. నాయకులు చాట్ల పుల్లారావు, నిమగడ్డ నరసింహ, రాంబాబు, తాతారావు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న నాయకులు, కార్మికులు

ఉత్సాహంగా.. ఉల్లాసంగా..

మండవల్లి, న్యూస్‌టుడే: మండవల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండల స్థాయి ఆటల పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామ దుర్గాప్రసాద్ పోటీలను ప్రారంభించారు. శుక్రవారం బాలుర ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, షటిల్, టెన్నికాయిట్, యోగా, చెస్ పోటీలు నిర్వహించారు. మండవల్లి మండలంలోని 7 జడ్పీ ఉన్నత పాఠశాలల నుంచి పెద్దఎత్తున విద్యార్థులు పాల్గొని ప్రతిభను చూపారు. మండల విద్యా వనరుల కార్యాలయంలో మండల స్థాయి వ్యాసరచన, వక్తృత్వ, చర్చ పోటీలను నిర్వహించారు. వక్తృత్వం పోటీలో కానుకొల్లు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎస్.కావ్య, వ్యాస రచనలో ఇంగిలిపాకలంక పాఠశాల విద్యార్థిని ఎస్.గాయత్రి, చర్చ పోటీలో కానుకొల్లు పాఠశాలకు చెందిన వైష్ణవి, రుక్మిణి దేవి ప్రథమ స్థానాలు సాధించినట్లు తెలిపారు.



పోటీలు ప్రారంభిస్తున్న ఎంపీపీ, అధికారులు

ఆగి ఉన్న లారీని ఢీకొన్న ప్రైవేటు బస్సు

పెనుబల్లి, న్యూస్‌టుడే: ఆగి ఉన్న ఉల్లిపాయల లోడు లారీని ఓ ప్రైవేటు బస్సు ఢీకొన్న ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. హైదరాబాద్ నుంచి ఏలూరుకు 13 మంది ప్రయాణికులతో ప్రైవేటు బస్సు బయల్దేరింది. నిద్రమత్తులో ఉన్న బస్ డ్రైవర్ ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం సీతారాంపురం వద్ద ఆగి ఉన్న లారీని వెనక నుంచి ఢీకొట్టాడు. ఘటనలో బస్సులో ఉన్న ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. 12 మంది స్వల్పంగా గాయపడ్డారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులు పెనుబల్లి వైద్యశాలకు తరలించారు. తీవ్రంగా గాయపడ్డ హైదరాబాద్‌కు చెందిన పూర్ణచందర్‌రావును మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. మిగతా వారు ప్రాథమిక వైద్యం చేయించుకొని వెళ్లిపోయారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సర్పంచి చవటపల్లి లక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.రాగమయి అన్నారు. పౌష్టికాహార మాసోత్సవం సందర్భంగా ఆగిరిపల్లి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారాన్ని సక్రమంగా తీసుకోవాలన్నారు.

పిచ్చిమొక్కల తొలగింపు

ముసునూరు, న్యూస్‌టుడే: ముసునూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆట స్థలంలో పచ్చగడ్డి, పిచ్చి మొక్కలు, కంప చెట్లు ఏపుగా పెరిగాయి. దీంతో దోమలు, విషసర్పాల బెడద ఎక్కువై విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. అంతేగాక తరగతి గదుల్లోకి పాములు సంచరించిన ఘటనలూ ఉన్నాయి. విద్యార్థులు ఆటలు ఆడేందుకు ప్రాంగణం అపరిశుభ్రంగా ఉండటంతో అసౌకర్యానికి గురవుతున్నారు. విషయం తెలుసుకున్న పాఠశాల ఎస్ఎంసీ ఛైర్మన్ నక్కా యోహాను తన సొంత ఖర్చులతో శుక్రవారం పాఠశాల ప్రాంగణంలోని ట్రాక్టర్‌తో పిచ్చి మొక్కలను తొలగించారు. ఎంఈవో సుబ్బారావు, ఉప సర్పంచి తోట శ్రీనివాసరావు, కొండేటి బాబి, వేల్పూరి శ్రీను, రెడ్డి తిరుపతిరావు పనులను పర్యవేక్షించారు.



పనులు పర్యవేక్షిస్తున్న ఉపాధ్యాయులు, నాయకులు

విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకోవాలి

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకోవాలని ఎంఈవోలు కె.సర్వేశ్వరరావు, కె.ఆనంద్ కుమార్ తెలిపారు. స్వర్ణాంధ్ర-2047 కార్యక్రమంలో భాగంగా మండల స్థాయిలో వ్యాసరచన, వక్తృత్వం, చర్చ కార్యక్రమాలను ఆగిరిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. న్యాయ నిర్ణేతలుగా కె.అజరయ్య, ఎస్.కె.అల్లాబక్ష, యామిని కృష్ణప్రియ, విఠల్ వ్యవహరించారు. ఇక్కడ ఎంపికైన విద్యార్థులు ఈనెల 28న ఏలూరులో నిర్వహించే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. హెచ్‌ఎం పి.పుష్పలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఎంపికైన విద్యార్థులతో ఎంఈవోలు సర్వేశ్వరరావు, ఆనంద్‌కుమార్

నిత్యావసర సరకుల వితరణ

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: నూజివీడు పట్టణం నెహ్రూపేటలోని పేద కుటుంబాలకు సెయింట్ విన్సెంట్ పాల్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిత్యావసర సరకులను వితరణగా అందించారు. సొసైటీ అధ్యక్షుడు పిల్లి రామారావు మాట్లాడుతూ.. నిరుపేదలకు తమ సొసైటీ అన్ని వేళలా అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మున్నా, సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించాలి: డీఏవో

టి.నరసాపురం, న్యూస్‌టుడే: అల్లంచర్లరాజుపాలెంలోని విత్తనాభివృద్ధి క్షేత్ర భూమిలో ఆక్రమణలు వెంటనే తొలగించాలని జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా అన్నారు. ఆ ప్రాంతాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా చుట్టుపక్కల రైతులతో మాట్లాడుతూ ఆక్రమణదారులు వెంటనే తొలగకుంటే చట్టపర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెవెన్యూ అధికారులను కలిసి విత్తనాభివృద్ధి క్షేత్ర భూమిలో ఆక్రమణ దారులకు నోటీసులు ఇవ్వాలని కోరారు. అనంతరం ఈ ఖరీఫ్ సీజన్‌లో విత్తనాభివృద్ధి కోసం వేరుశనగ సాగు ప్రారంభించాలని వ్యవసాయ శాఖాధికారులకు సూచించారు.

వంతెనపై గొయ్యి.. ఆదమరిస్తే అంతేనోయి!

నూజివీడు పట్టణం తిరువూరు రహదారిలోని శ్మశాన వాటిక సమీపంలో ఉన్న వంతెనపై గొయ్యి ప్రమాదకరంగా మారింది. రోజురోజుకు అది పెరుగుతూ రోడ్డు కోతకు గురవుతుందని వాహనదారులు వాపోతున్నారు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా.. పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా గొయ్యి పూడ్చి ప్రమాదాల నుంచి ప్రజలను రక్షించాలని కోరుతున్నారు. ఈ విషయమై డీఈ సత్యనారాయణను సంప్రదించగా.. గొయ్యి పూడ్చే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. **- న్యూస్‌టుడే, నూజివీడు పట్టణం**



సమస్యలు పరిష్కరించాలని వినతి

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: పురపాలక ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముస్తాఫాఅలీ, ఆర్.రవి కుమార్ తదితరులు శుక్రవారం డీఈవోకు వినతిపత్రం అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ పురపాలక ఉన్నత పాఠశాలల్లో తగినంత మంది సబ్జెక్టు ఉపాధ్యాయులను నియమించాలన్నారు. హెచ్‌ఎంలలో అర్హులకు అర్బన్ ఎంఈవోలుగా ఉద్యోగోన్నతి కల్పించాలని కోరారు. జీపీఎఫ్ ఖాతాలు తెరిపించాలని, బదిలీలు వెంటనే నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.

మండల స్థాయి ఎంపికలు వాయిదా

ముదినేపల్లి: స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించాల్సిన మండల స్థాయి ఆటల పోటీలు, ఎంపికలను వాయిదా వేసినట్లు పీడీ రోజా తెలిపారు. వర్షం కారణంగా పోటీలకు మైదానం అనుకూలంగా లేకపోవడంతో గురు, శుక్రవారం జరగాల్సిన పోటీలను వాయిదా వేశామన్నారు. శనివారం ఈ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు.

సినిమాలు

నూజివీడు పట్టణం

సత్యనారాయణ	**దేవర**
సత్యనారాయణ మినీ	**సరిపోదా శనివారం**
ద్వారక సినిమాస్ స్క్రీన్ 1	**దేవర**
ద్వారక సినిమాస్ స్క్రీన్ 2	**మత్తు వదలరా 2**
ద్వారక సినిమాస్ స్క్రీన్3	**దేవర**
ఆగిరిపల్లి: శ్రీఅను డీలక్స్	**కళింగ**
కైకలూరు	
విజయలక్ష్మి జీవి సినిమాస్	**దేవర**
మాగంటి సినిమాస్	**చిక్లెట్స్**
శ్రీవెంకటరమణ సినిమాస్	**దేవర**
ముదినేపల్లి: పూర్ణిమ	**దేవర**